RNI Reg-No. APTEL/2002/07373

Postal Registration No.VJ/215/2025-27

# నేటి మనదేశమ్

NETIMANADESAM TELUGU DAILY

తెలుగు దినపత్రిక

Simultaneously published from Vijayawada, Visakhapatnam, Tirupati & Hyderabad

సంపుటి :24 Vol. No.24 సంచిక : 95 Issue No. 95 విజయవాడ Vijayawada సంపాదకులు: కె.ఎస్.రంగశాయి: శనివారం 04-04-2026 Saturday, April 04 2026 పేజీలు : 8 Pages: 8 వెల: రూ.1-00 Price Rs.1-00

## బైక్‌ను బలంగా ఢీకొన్న ట్రావెల్స్ బస్సు

### ముగ్గురు యువకుల దుర్మరణం

**అనకాపల్లి, ఏప్రిల్ 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అనకాపల్లి జిల్లాలో అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు ప్రాణాలు కోల్పోయారు. ఎలమంచిలి మండలం పోతిరెడ్డిపాలెం జంక్షన్ వద్ద రాత్రి 12 గంటల ప్రాంతంలో ద్విచక్ర వాహనాన్ని ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందగా.. మరొకరు అనకాపల్లికి తరలిస్తుండగా చనిపోయారు. మృతి చెందిన ముగ్గురు యువకులు ఎలమంచిలి మండలం పురుషోత్తపురం గ్రామానికి చెందిన వారుగా గుర్తించారు. మృతులు బంగారు నాని(24), గోవిందు (25) , పోతిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన బంగారి దుర్గాప్రసాద్(16)గా గుర్తించారు. మృతుల్లో ఇద్దరు పెయింటింగ్ పనులు చేసుకోగా, మరో యువకుడు చదువుతున్నట్లు మిగతా 2లో..

## నేటి నుంచి రబీ ధాన్యం కొనుగోళ్లు


❑రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 1,917 కొనుగోలు కేంద్రాలు

❑వెల్లడించిన పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల



**కాకినాడ, ఏప్రిల్ 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రైతులకు శుభవార్త చెప్పింది.. నేటి నుంచి రబీ సీజన్‌కు సంబంధించిన ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం కానున్నట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. తూర్పు గోదావరి జిల్లా నిడదవోలులో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఈ వివరాలు తెలియజేశారు.. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 1,917 కొనుగోలు కేంద్రాల ద్వారా సుమారు 23 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఇక, ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నేరుగా డబ్బులు జమ చేస్తామని మంత్రి నాదెండ్ల స్పష్టం చేశారు. రైతులు తమ పంటకు సరైన ధర పొందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ధాన్యం నిల్వ మరియు రవాణా విషయంలో కూడా ప్రభుత్వం ముందస్తు ఏర్పాట్లు చేసింది.

మొత్తం 5.40 కోట్ల గోతాలను సిద్ధం చేసినట్లు, గోతాల కొరత రాకుండా మిల్లర్లతో ఇప్పటికే చర్చలు జరిపినట్లు తెలిపారు. అలాగే ధాన్యం రవాణా కోసం 17,200 లారీలను జీపీఎస్ సదుపాయంతో సిద్ధం చేసినట్లు వెల్లడించారు. మొత్తంగా, ఈసారి రబీ ధాన్యం కొనుగోళ్లు పారదర్శకంగా, వేగంగా జరిగేలా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.




# అమరావతిని నాశనం చేయాలని చూస్తే శాసనం చేశాం

### మీడియా సమావేశంలో సీఎం చంద్రబాబు

**అమరావతి, ఏప్రిల్ 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాజధాని అమరావతి చట్టబద్ధత బిల్లుకు పార్లమెంట్ ఆమోదం తెలపడం ప్రజా విజయమని.. ఇది ప్రజా రాజధానికి దక్కిన గౌరవమని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. ఈ బిల్లుకు వైకాపా మినహా అన్ని పార్టీలూ మద్దతు తెలిపాయని చెప్పారు. ఉండవల్లిలోని తన నివాసంలో మిగతా 2లో..

## అప్పుడు వారు నాలుగు పెళ్లిళ్లు చేసుకోలేరు

### సివిల్‌కోడ్‌పై అమిత్‌షా



**గోల్‌పాడా, ఏప్రిల్ 3 (ఆర్ఎన్ఎ):** అస్సాం అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాజపా అగ్ర నేత, కేంద్ర హోంమంత్రి అమిత్ షా పాల్గొన్నారు. గోల్‌పాడా జిల్లాలో జరిగిన ఎన్నికల ర్యాలీలో కీలక వ్యాఖ్యలు చేశారు. చొరబాటుదారులు నాలుగు పెళ్లిళ్లు చేసుకోకుండా ఉమ్మడి పౌరస్మృతి ద్వారా అడ్డుకునే వీలు ఉంటుందన్నారు. "ఆదివాసీల అభివృద్ధి కోసం ప్రధాని మోదీ, అస్సాం ముఖ్యమంత్రి రోడ్ మ్యాప్ సిద్ధం చేశారు. మోదీ నాయకత్వంలో ఆదివాసీ మహిళ దేశ ప్రథమ పౌరురాలు అయ్యారు" అని పేర్కొన్నారు. గిరిజన ప్రాంతాల్లో యూసీసీని బలవంతంగా రుద్దుతారంటూ కాంగ్రెస్ చేస్తున్న ప్రచారాన్ని ఆయన తిప్పికొట్టారు. ఈ సందర్భంగా ఇటీవల మేఘాలయలో తలెత్తిన ఉద్రిక్తతలను ప్రస్తావించారు. చొరబాటుదారులు అక్కడి మిగతా 2లో..

## ఇరిగేషన్ అధికారులు తీరు మార్చుకోవాలి

■గత ప్రభుత్వంలో లాగా చేస్తామంటే కుదరదు

■సిఈలతో వీడియో కాన్ఫరెన్స్ లో మంత్రి నిమ్మల రామానాయుడు



**అమరావతి, ఏప్రిల్ 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** గతంలో ప్రభుత్వంలో వ్యవహరించినట్లుగా కాకుండా, ఇరిగేషన్ అధికారులు తీరు మార్చుకోవాలని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు హెచ్చరించారు . శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సిఈలతో వీడియో కాన్ఫరెన్స్ లో మాట్లాడిన మంత్రి నిమ్మల నియోజకవర్గాల వారీగా కాలువల్లో తూడు, గుర్రపుడెక్క, పూడికతీత, వంటి పనులకు సంబందించిన అంచనాల తయారీపై సమీక్ష నిర్వహించారు. ఆయా పనులకు సంబందించి మార్చి 25వ తేదీలోపు నియోజకవర్గాల వారీగా అంచనాలు రూపొందించి పంపించాలని ఆదేశించినా, ఇప్పటివరకు కొంత మంది చీఫ్ ఇంజనీర్లు సరిగా అంచనాలు సమర్పించకపోవడంతో మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలువల్లో తూడు, గుర్రపుడెక్క, మట్టి మిగతా 2లో..

## డిప్రెషన్‌లో జగన్.. అందుకే 'మావిగన్' వ్యాఖ్యలు

### భాజపా ఏపీ అధ్యక్షుడు మాధవ్



**అమరావతి, ఏప్రిల్ 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అసెంబ్లీ ఎన్నికల ఓటమి అనంతరం వైకాపా అధినేత జగన్ మానసిక స్థితి సరిగా లేదని భాజపా ఏపీ అధ్యక్షుడు మాధవ్ అన్నారు. రాష్ట్రాభివృద్ధి, అమరావతికి చట్టబద్ధత చూసి జగన్ డిప్రెషన్‌లోకి వెళ్లారని విమర్శించారు. రాజధాని అంశంలో అర్థం లేకుండా జగన్ 'మావిగన్' అని మాట్లాడటానికి ఇది పరాకాష్ఠ అన్నారు. పార్లమెంట్‌లో అమరావతి చట్టబద్ధత బిల్లు ఆమోదానికి సహకరించిన వారికి మాధవ్ ధన్యవాదాలు తెలిపారు.

## మరోమారు నోరు పారేసుకున్న ఖవాజా

### భారత్ దాడులు చేస్తే బుద్ధి చెబుతామని హెచ్చరిక



**ఇస్లామాబాద్, ఏప్రిల్ 3 (ఆర్ఎన్ఎ):** పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ మరోసారి భారత్‌పై అక్కసు వెళ్లగక్కారు. పహల్గాం దాడి జరిగి ఏడాది కావస్తున్న నేపథ్యంలో భారత్ తమపై బెదిరింపులకు పాల్పడుతోందని ఆరోపించారు. ఇవన్నీ చూస్తుంటే వారు తమపై దాడులకు ప్రణాళికలు రచిస్తూ. .రెచ్చగొట్టడానికి ప్రయత్నిస్తున్నట్లు అనిపిస్తోందన్నారు. మరోసారి తమతో ఘర్షణకు దిగితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. తమపై జరిగే దాడులను వేగవంతమైన, ప్రణాళికాబద్ధమైన ప్రతిస్పందనతో మిగతా 2లో..

## ఎపిలో ఒక్కసారిగా మారిన వాతావరణం

●పలు జిల్లాల్లో వర్షం కురిసే అవకాశం

●ఈదురుగాలులు కూడా ఉంటాయని హెచ్చరిక



**అమరావతి, ఏప్రిల్ 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో పిడుగులతో కూడిన మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం అత్యవసర హెచ్చరిక జారీ చేసింది. ముఖ్యంగా అల్లూరి సీతారామరాజు, పోలవరం జిల్లాల్లో వర్ష ప్రభావం ఎక్కువగా ఉండనుందని, ఆయా జిల్లాల యంత్రాంగం ఇప్పటికే అప్రమత్తమైంది. వర్షంతో పాటు గంటకు 40 నుండి 60 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీచే మిగతా 2లో..

## ఎమ్మెల్యే అరవింద్ బాబుపై సిఎం సీరియస్

### పార్టీ కార్యాలయంలో చర్చించిన అధ్యక్షుడు పల్లా



**అమరావతి, ఏప్రిల్ 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పల్నాడు జిల్లా నరసరావుపేట ఎమ్మెల్యే అరవింద బాబుపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సీరియస్ అయ్యారు. పార్టీ పరువుకు భంగం కలిగిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఇటీవల తాను చెప్పిన వ్యక్తికి లీగల్ అడ్వైజర్ పోస్ట్ ఇవ్వలేదని అరవింద బాబు హల్ చల్ చేశారు. ఏకంగా పల్నాడు జిల్లా ఎస్పీ కార్యాలయంలో బైఠాయించి నిరసన తెలిపారు. ఈ విషయం కాస్తా పార్టీ అధినేత, సీఎం చంద్రబాబు దృష్టికి వెళ్లింది. ఎమ్మెల్యేతో మాట్లాడాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు శుక్రవారం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయానికి అరవింద బాబును పల్లా శ్రీనివాసరావు పిలిపించారు. ఎస్పీ కార్యాలయంలో బైఠాయించడంపై వివరణ కోరారు. ఘటనపై టీడీపీ అధినేత చంద్రబాబు అసంతృప్తిగా ఉన్నారని.. ఇది ఎంతమాత్రం సహించరాని విషయమని అరవింద బాబుకు పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. లీగల్ అడ్వైజర్ నియామకం జరగకపోతే పార్టీ జిల్లా అధ్యక్షుడు, రీజనల్ కోఆర్డినేటర్ లేదా తన దృష్టికి ఎందుకు తీసుకురాలేదని ఎమ్మెల్యేను ప్రశ్నించారు. అంతేకాని ఇలా పార్టీ పరువుపోయేలా ప్రవర్తించడం ఏంటని నిలదీశారు. సందర్భంగా ఎస్పీ కార్యాలయంలో బైఠాయించడం, పార్టీ పరువుకు భంగం కలిగించే ప్రయత్నాలను ఖండించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతమైతే పార్టీ తరఫున తీవ్ర చర్యలు తీసుకునేందుకు వెనుకాడేది లేదని తేల్చిచెప్పారు. అయితే, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా చూసుకుంటానని ఎమ్మెల్యే అరవింద బాబు హామీ ఇచ్చారు.

## శత్రువుకు చిక్కని 'తారాగిరి'.. నేవీలోకి మరో యుద్ధనౌక




**న్యూఢిల్లీ, ఏప్రిల్ 3 (ఆర్ఎన్ఎ):** భారత నౌకాదళ అమ్ముల పొదిలో మరో అస్త్రం చేరింది. అత్యాధునిక యుద్ధ నౌక 'ఐఎన్ఎస్ తారాగిరి' శుక్రవారం జలప్రవేశం చేసింది. విశాఖ నేవల్ డాక్ యార్డులో జరిగిన కార్యక్రమంలో కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చేతుల మీదుగా దీన్ని కమిషన్ చేశారు. ఈ కార్యక్రమంలో సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్, నౌకాదళ అధిపతి దినేశ్ కె.త్రిపాఠి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. స్టెల్త్ సాంకేతికతతో రూపొందించిన ఈ ఫ్రిగేట్ భారత సముద్ర సరిహద్దు రక్షణలో కీలక పాత్ర మిగతా 2లో..

**మొదటి పేజీ తరువాయిలు**

## అప్పుడు వారు నాలుగు పెళ్లిళ్లు చేసుకోలేరు

ఆదివాసీ మహిళలను వివాహం చేసుకోవడం ద్వారా రాజకీయ పలుకుబడిని సంపాదించడానికి ప్రయత్నించారని, ఇది ఉద్రిక్తతలకు దారితీసిందని ఆయన ఆరోపించారు. తాము అధికారంలోకి వస్తే.. అక్రమ చొరబాట్ల విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని చెప్పారు. "అస్సాంలో మాకు మరో ఐదేళ్ల సమయం ఇవ్వండి. రాష్ట్రానికి చొరబాటుదారుల నుంచి విముక్తి కల్పించేలా చర్యలు తీసుకుంటాం. అస్సాంలో యూసీసీని అమలు చేస్తాం. దాంతో చొరబాటుదారులు నాలుగు పెళ్లిళ్లు చేసుకోలేరు" అని వెల్లడించారు.

## శత్రువుకు చిక్కని 'తారాగిరి'.. నేవీలోకి మరో యుద్ధనౌక

పోషించనుంది. నీలగిరి శ్రేణి 17-ఏలో నాలుగో ప్రాజెక్టుగా ఈ యుద్ధనౌకను ముంబయిలోని మజగాన్ డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్ (ఎండీఎల్)లో నిర్మించారు. స్వదేశీ ఆధునిక సాంకేతికత వినియోగంలో 75 శాతానికిపైగా సూక్ష్మ,చిన్న మధ్య తరహా పారిశ్రామిక రక్షణ ఉత్పత్తుల తయారీ సంస్థలు భాగస్వామ్యం అయినట్లు నేవీ వర్గాలు పేర్కొన్నాయి. శత్రువుల రాడార్‌లకు కనిపించకుండా పనిచేసే సామర్థ్యం ఈ వార్‌షిప్ ప్రత్యేకత. ఐఎన్ఎస్ తారాగిరిని గతేడాది నవంబరు 28న నేవీకి అప్పగించారు.

**ఐఎన్ఎస్ తారాగిరి విశేషాలివే..**

149 మీటర్ల పొడవు, 17.8 మీటర్ల వెడల్పుతో 6,670 టన్నుల బరువుండే ఐఎన్ఎస్ తారాగిరి కంబైన్డ్ డీజిల్/గ్యాస్ ఆధారిత ప్లాంటుతో సముద్ర జలాల్లో గంటకు 28 నాట్స్ వేగంతో ప్రయాణించగలదు.

ఇందులో నిశ్శబ్ద ఫిరంగుల (స్టెల్త్ ఫ్రిగేట్)తో కూడిన ఆధునిక టెక్నాలజీ ఉంది. బరాక్-8 వంటి విమాన విధ్వంసక, 8 బ్రహ్మోస్ నౌకా విధ్వంసక క్షిపణులు ఇందులో ఉన్నాయి.

యాంటీ సబ్‌మెరైన్ వార్ఫేర్ వ్యవస్థతోపాటు, శత్రువుల జాడను, ముప్పును ముందే పసిగట్టే రాడార్ వ్యవస్థ ఉంది.

## మరోమారు నోరు పారేసుకున్న ఖవాజా

తిప్పికొడతామన్నారు. ఇరాన్ యుద్ధాన్ని అవకాశంగా తీసుకొని పొరుగుదేశం ఏదైనా దుస్సాహసానికి పాల్పడితే ప్రతిస్పందన తీవ్రంగా ఉంటుందని ఇటీవల కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ పాక్‌ను హెచ్చరించారు. ఉరి సెక్టార్ దాడి తర్వాత జరిపిన సర్జికల్ స్ట్రైక్స్, పుల్వామా తర్వాత వైమానిక దాడులు, పహల్గాం దాడుల అనంతరం ఆపరేషన్ సిందూర్‌లను గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో ఖవాజా ఆసిఫ్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

## బైక్‌ను బలంగా ఢీకొన్న ట్రావెల్స్ బస్సు

పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. యువకుల మృతి సమాచారాన్ని కుటుంబసభ్యులకు తెలియజేశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

## ఏపిలో ఒక్కసారిగా మారిన వాతావరణం

అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. పిడుగులు పడే ప్రమాదం ఉన్నందున చెట్ల కింద, విద్యుత్ స్తంభాల సమీపంలో ఉండవద్దని సూచించారు. ముఖ్యంగా బహిరంగ ప్రదేశాల్లో ఉన్నవారు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని, పొలాల్లో పనిచేసే రైతులు, పశువుల కాపరులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ శాఖ స్పష్టం చేసింది. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ప్రజలు అత్యవసర పనులు ఉంటే తప్ప బయటకు రావొద్దని, ప్రయాణాలను వాయిదా వేసుకోవడం ఉత్తమమని తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు, నదీ పరివాహక ప్రాంతాల వారు స్థానిక అధికారుల సూచనలను ఎప్పటికప్పుడు గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. మరో వైపు తెలంగాణలోనూ రానున్న 3 రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురవనున్నాయని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొన్నారు. శుక్రవారం ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో వర్షం కురిసే అవకాశం ఉంది. శనివారం ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, జగిత్యాల, సిరిసిల్ల, జనగామ జిల్లాల్లో వర్షం పడే అవకాశముంది. ఆదివారం ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, జగిత్యాల, సిరిసిల్ల, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి, జనగామ జిల్లాల్లో వర్షం కురిసే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. పలు జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

## మచిలీపట్నం ఘటనలో పోలీసులు తీరు దారుణం

**మాజీమంత్రి పేర్నినాని ఘాటు విమర్శలు**

**మచిలీపట్నం, ఏప్రిల్ 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మచిలీపట్నం కొబ్బరితోటలో అక్రమ నిర్మాణాల కూల్చివేత ఘటనలో పోలీసులపై అనుచిత వ్యాఖ్యలు చేశారనే కారణంగా రాష్ట్ర మాజీ మంత్రి పేర్ని నానిపై పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైన సంగతి తెలిసిందే. అయితే.. దీనిపై పేర్ని నాని స్పందించారు. గురువారం జరిగిన ఈ ఘటనపై జిల్లా పోలీస్ అధికార సంఘం అధినేత జయపాల్.. ప్రెస్‌మీట్లో మాట్లాడిన విధానాన్ని తప్పుబట్టారు. నిన్న జరిగిన సంఘటనకు సంబంధించిన వీడియోను చూసి జయపాల్ మాట్లాడిఉంటే బాగుండేది. అక్కడ జరిగిన సంఘటన ఏమిటి? ఆయన ప్రెస్ మీట్లో మాట్లాడిందేమిటి.? వైసీపీ తరఫున శాసనసభ ఎన్నికల్లో పోటీచేసిన వ్యక్తి పేర్ని కిట్టు. ఆయనతో పాటు కార్పొరేటర్లు వచ్చి అండగా నిలబడ్డారు. గత ప్రభుత్వంలో ఏ పేదవాని ఇంటినీ మేం కూల్చలేదు. కానీ మున్సిపల్ అధికారులు ఇప్పుడు కొబ్బరితోటలను కూల్చడం ప్రారంభించారు. గౌరవం ఇచ్చిపుచ్చుకోవాలని తెలిపారు.. బాగుంది. కానీ అక్కడ ఏం జరిగిందో జయపాల్ తెలుసుకోకుండా.. బాడీ షేమింగ్ చేశారని ఎలా మాట్లాడారు? అసలు ఆ సీఐని మేమెక్కడా ఉదహరించలేదు. ఆయన పేరుతో ఏమీ అనలేదు. అయినా ఏకవచనంతో మీరు మాట్లాడవచ్చా?' అని పేర్ని నాని ప్రశ్నించారు. నా మీద, నా కొడుకు మీద అక్రమ కేసులు కట్టారు. కేవలం పబ్లిసిటీ కోసం ఎవరు ఎదిగారు? ఎవరు ఆరాటపడుతున్నారు? జయపాల్.. నాకు రాజకీయ పబ్లిసిటీ దేనికి? నేను ప్రజలకోసం పోరాటంచేసే వ్యక్తిని? కొందరు పోలీసులు భయంలేకుండా తప్పులు చేస్తున్నారు.

# అమరావతిని నాశనం చేయాలని చూస్తే శాసనం చేశాం

**(మొదటి పేజీ తరువాయి)**

ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీఎం మాట్లాడారు. అమరావతి చట్టబద్ధత బిల్లు ఆమోదానికి సహకరించిన ప్రధాని మోదీ, కేంద్రహోంమంత్రి అమిత్‌షా, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్‌కు చంద్రబాబు ధన్యవాదాలు తెలిపారు. బిల్లుకు మద్దతిచ్చిన అన్ని పార్టీలకు ధన్యవాదాలు చెప్పారు. దేశంలోని అన్ని పార్టీలది ఒక దారైతే వైకాపాది మరో దారి. ఆ పార్టీ నేతలు ప్రజల చేత ఓట్లు వేయించుకుని రాష్ట్రానికి ద్రోహం చేశారు. రాష్ట్రం నాశనమైపోయినా ఫర్వాలేదని వైకాపా ముందుకెళ్లింది. అమరావతిని నాశనం చేయాలని చూస్తే మేం శాసనం చేశాం. విభజన జరిగినప్పుడు రెండు రాష్ట్రాల ప్రజల మనోభావాలు దెబ్బతిన్నాయి. సమైక్యాంధ్రప్రదేశ్‌లో తొమ్మిదేళ్లు సీఎంగా ఉన్నా. తెలుగుజాతి కోసం సైబరాబాద్, హైటెక్‌సిటీ నిర్మించాను. రెండు రాష్ట్రాల ప్రజలకు న్యాయం చేసి విభజన చేయాలని కోరాం. రాజధాని లేకుండా రాష్ట్రాన్ని విభజించారు. విభజన తర్వాత పరిపాలన చేసేందుకు ఎక్కడ కూర్చోవాలో తెలియని పరిస్థితి. ఇరిగేషన్ ఎస్ఈ కార్యాలయమే నా క్యాంపు కార్యాలయం అయింది. బస్సులోనే బస చేసేవాడిని. విజయవాడ-గుంటూరు మధ్య రాజధానికి అనుకూలమని 46 శాతం ప్రజలు చెప్పారు. అభివృద్ధి వికేంద్రీకరణ తెదేపా సిద్ధాంతం. రాజధాని ఉంటేనే ఏపీకి భవిష్యత్ ఉంటుందని సంకల్పించాం. రాష్ట్రానికి మధ్యలో రాజధాని ఏర్పాటు చేశాం. నాకున్న అనుభవంతో తెలంగాణలోని 7 మండలాలను విలీనం చేయించా. పోలవరం ముంపు మండలాలను ఏపీలో కలిపితేనే సీఎంగా ప్రమాణ స్వీకారం చేస్తానని చెప్పా. తెలంగాణకు నేనెప్పుడూ వ్యతిరేకం కాదు. తెలుగు ప్రజల కోసం హైదరాబాద్‌ను అభివృద్ధి చేశాం. తెలంగాణ ప్రజల గౌరవాన్ని పోగొట్టుకునే పని ఎప్పుడూ చేయను" అని సీఎం చంద్రబాబు అన్నారు.

# ఇరిగేషన్ అధికారులు తీరు మార్చుకోవాలి

**(మొదటి పేజీ తరువాయి)**

పూడిక తీత వంటి పనులు చేయడానికి ఏప్రియల్, మే, నెలలో మాత్రమే అవకాశం ఉంటుంది. ఆతరువాత ఖరీఫ్ సీజన్ మొదలైతే పనులు చేయడానికి అవకాశం ఉండదని, గతంలో ఏప్రియల్, మే నెలలో చేయాల్సిన పనులకు జూన్ లో అనుమతులు ఇచ్చేవారని, పనులు మొదలుపెట్టిన వెంటనే కాలువలకు నీళ్ళు వదిలేవారని, దీంతో పనులు సగంలోనే వదిలేయాల్సి వచ్చేదని గుర్తు చేశారు. ఇలా చేయడం వల్ల ఆయకట్టు చివరన ఉన్న పొలాలకు సాగు నీరందక రైతులు ఇబ్బంది పడాల్సి వస్తుందని, ఇలా గతంలో వ్యవహరించిన తీరులో కాకుండా ముందుగానే అంచనాలు రూపొందించి, ఆర్థిక శాఖ అనుమతులు పొందితే సీజన్ మొదలయ్యేలోగా పనులు కూడా పూర్తి చేయడానికి అవకాశం ఉంటుందని అన్నారు. కావున నియోజకవర్గాల వారీగా పనులకు సంబంధించిన అంచనాలను ఆదివారం సాయంత్రం లోగా పంపాలని సిఈలను ఆదేశించారు. గడువులోగా అంచనాలను పంపని అధికారులు సోమవారం అమరావతి సచివాలయంకు వచ్చి అంచనాలు ఎందుకు పంపలేకపోయారో సంజాయిషీ ఇచ్చుకోవలసి ఉంటుందని తీవ్రంగా మంత్రి నిమ్మల రామానాయుడు హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అత్యవసర పనుల కింద నిధులు విడుదల చేసి, కాలవల్లో పూడిక తీత, తూడు, గుర్రపుడెక్క తొలగింపు వంటి పనులను చేయడం ద్వారా ఆయకట్టు రైతులకు సాగునీరందించగలిగామని తెలిపారు. గత 5ఏళ్ళ వైసిపి ప్రభుత్వ పాలనలో కనీస నిర్వహణ పనులు సైతం పట్టించుకోకపోవడంతో ఆయకట్టు చివరి ఎకరం వరకు నీరందక రైతులు ఇబ్బంది పడ్డారని, నేడు కూటమి ప్రభుత్వం ప్రతి ఎకరాకు సాగు నీరందించడమే లక్ష్యంగా పెట్టుకుని పని చేస్తున్నామని స్పష్టం చేశారు. కావున అధికారులు నిర్లక్ష్యం వదిలి గడువులోగా ఇరిగేషన్ పనులకు సంబంధించిన అంచనాలు సమర్పించి, సీజన్ మొదలయ్యేలోగా, నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

# పార్టీ అభ్యర్థుల తరపున ప్రచారం

**పార్టీ నాకు అప్పగించిన బాధ్యత ఇదే... తమిళనాడు బిజెపి నేత అన్నామలై**



**చెన్నై,ఏప్రిల్3(ఆర్ఎన్ఎ):** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల జాబితాలో తన పేరు లేకపోవడంపై బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు అన్నామలై స్పందించారు. ఈ ఎన్నికల్లో రాష్ట్రంలో పార్టీ తరఫున పోటీ చేసే అభ్యర్థుల తరఫున ప్రచారం చేయడమే తన పాత్ర అని, అది తన బాధ్యత అని చెప్పారు. కన్నూరులో శుక్రవారంనాడు జరిగిన ఎన్నికల ప్రచారసభలో అన్నామలై పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, ప్రస్తుతానికి తమిళనాడులో పోటీ చేసే పార్టీ అభ్యర్థుల తరఫున ప్రచారం కొనసాగించడమే తనకు అప్పగించిన బాధ్యత అని చెప్పారు. ప్రస్తుతం పుదుచ్చేరి, కేరళలో ఈనెల 7వ తేదీ వరకూ ప్రచారం ఉంటుంది. 7వ తేదీ నుంచి 23 వరకూ తమిళనాడులో బీజేపీ, ఎన్డీయే అభ్యర్థులందరి తరఫున ప్రచారంలో పాల్గొంటాను. పార్టీ అప్పగించిన బాధ్యత ఇది. దానికి పూర్తి న్యాయం చేస్తాను' అని అన్నామలై చెప్పారు. కన్నూరులో బీజేపీ అభ్యర్థి సి.రఘునాథ్ తరఫున ఆయన ప్రస్తుతం ప్రచారం సాగిస్తున్నారు. ఎన్డీయే కూటమితో సంప్రదిం వెలువడతాయి.

# భారత నౌకాదళ అమ్ముల పొదిలో మరో అస్త్రం

**అత్యాధునిక యుద్ధ నౌక 'ఐఎన్ఎస్ తారాగిరి' జలప్రవేశం**

**విశాఖలో ప్రారంభించిన కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్**

**విశాఖపట్నం, ఏప్రిల్ 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** భారత నౌకాదళ అమ్ముల పొదిలో మరో అస్త్రం చేరింది. అత్యాధునిక యుద్ధ నౌక 'ఐఎన్ఎస్ తారాగిరి' శుక్రవారం జలప్రవేశం చేసింది. విశాఖ నేవల్ డాక్ యార్డులో జరిగిన కార్యక్రమంలో కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చేతుల మీదుగా దీన్ని కమిషన్ చేశారు. ఈ కార్యక్రమంలో సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్, నౌకాదళ అధిపతి దినేశ్ కె.త్రిపాఠి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. స్టెల్త్ సాంకేతికతతో రూపొందించిన ఈ ఫ్రిగేట్ భారత సముద్ర సరిహద్దు రక్షణలో కీలక పాత్ర పోషించనుంది. నీలగిరి శ్రేణి 17-ఏలో నాలుగో ప్రాజెక్టుగా ఈ యుద్ధనౌకను ముంబయిలోని మజగాన్ డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్ (ఎండీఎల్)లో నిర్మించారు. స్వదేశీ ఆధునిక సాంకేతికత వినియోగంలో 75 శాతానికిపైగా సూక్ష్మ,చిన్న మధ్య తరహా పారిశ్రామిక రక్షణ ఉత్పత్తుల తయారీ సంస్థలు భాగస్వామ్యం అయినట్లు నేవీ (ఎనిటతిజీని ఔజీలా) వర్గాలు పేర్కొన్నాయి. శత్రువుల రాడార్‌లకు కనిపించకుండా పనిచేసే సామర్థ్యం ఈ వార్‌షిప్ ప్రత్యేకత. ఐఎన్ఎస్ తారాగిరిని గతేడాది నవంబరు 28న నేవీకి అప్పగించారు. 149 మీటర్ల పొడవు, 17.8 మీటర్ల వెడల్పుతో 6,670 టన్నుల బరువుండే ఐఎన్ఎస్ తారాగిరి కంబైన్డ్ డీజిల్/గ్యాస్ ఆధారిత ప్లాంటుతో సముద్ర జలాల్లో గంటకు 28 నాట్స్ వేగంతో ప్రయాణించగలదు. ఇందులో నిశ్శబ్ద ఫిరంగులతో కూడిన ఆధునిక టెక్నాలజీ ఉంది. బరాక్-8 వంటి విమాన



విధ్వంసక, 8 బ్రహ్మోస్ నౌకా విధ్వంసక క్షిపణులు ఇందులో ఉన్నాయి. యాంటీ సబ్‌మెరైన్ వార్ఫేర్ వ్యవస్థతోపాటు, శత్రువుల జాడను, ముప్పును ముందే పసిగట్టే రాడార్ వ్యవస్థ ఉంది. అరిదమన్ అనేది ఒక పదం కాదని.. ఒక శక్తి అని కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అభివర్ణించారు. భారత్ మూడో స్వదేశీ అణు సబ్‌మెరైన్ అరిదమన్ అని తెలిపారు. దీంతో సముద్ర ఆధారిత అణు నిరోధకశక్తి మరింత బలోపేతం అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఓ ఆధ్వర్యంలో పని చేస్తున్న నావెల్ సైన్స్ అండ్ టెక్నాలజీ లెబోరెటరీ (ఎన్ఎస్‌టీఎల్)ను రాజ్‌నాథ్ సింగ్ సందర్శించారు. అందులోని కావిటేషన్ టన్నెల్‌కు సైతం ఆయన శంకుస్థాపన చేశారు. 2016లో ఐఎన్ఎస్ అరిహంత్, 2024 ఆగస్టులో ఐఎన్ఎస్ అరిఘాట్‌ల సరసన తాజాగా ఐఎన్ఎస్ అరిదమన్ చేరింది. అరిదమన్ చేరికతో.. అణుశక్తితో నడిచే బాలిస్టిక్ క్షిపణి జలాంతర్గాములను సొంతంగా నిర్మించి, నిర్వహిస్తున్న అగ్రరాజ్యాలు అమెరికా, రష్యా, బ్రిటన్, ఫ్రాన్స్, చైనా వంటి ఎంపిక చేసిన దేశాల క్లబ్‌లో భారత్ చేరింది. ఈ జలాంతర్గాములు శత్రువుల కంటపడకుండా నెలల తరబడి సముద్రగర్భంలో ఉంటాయి. శత్రు దేశాల నుంచి అణు దాడి జరిగితే.. సముద్రం లోపలి నుంచే దీటుగా ఇవి బదులిస్తాయి.

## మరో మూడు రోజులు పార్లమెంట్... 16 నుంచి తిరిగి సమావేశాలు ప్రారంభం

**మహిళా రిజర్వేషన్ ,ఎఫ్‌సిఆర్ఎ సవరణ బిల్లులపై చర్చ**

**న్యూఢిల్లీ,ఏప్రిల్3(ఆర్ఎన్ఎ):** మహిళా రిజర్వేషన్ల సవరణ బిల్లు, ఎఫ్‌సిఆర్ఎ సవరణ బిల్లు వంటి ముఖ్యమైన బిల్లులను ఆమోదింపజేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ సమావేశాలను పొడిగించేందుకు ప్రయత్నిస్తోంది. గురువారం బడ్జెట్ సమావేశాల రెండో దశ ముగిసిన తరువాత పార్లమెంట్ నిరవధికంగా వాయిదా పడుతుందని భావించారు. అయితే, సభా కార్యకలాపాలు ముగిసిన తరువాత, ఈ నెల 16న ఉదయం 11 గంటల వరకు సభ వాయిదా పడుతుందని అధికారిక ప్రకటన వెలువడింది. లోక్‌సభ, శాసనసభలలో సీట్లను పెంచేందుకు, మహిళా రిజర్వేషన్లను అమలు చేసేందుకు ఉద్దేశించిన రాజ్యాంగ సవరణ బిల్లులను ఆమోదించేందుకే సమావేశాలను పొడిగిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం చెబుతోంది. అదే సమయంలో విమర్శలు ఎదుర్కొంటున్న ఎఫ్‌సిఆర్ఎ సవరణ బిల్లును కూడా ఆమోదించితీరాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ఎఫ్‌సిఆర్ఎ సవరణ బిల్లుపై పార్లమెంట్ లోపల, వెలుపల భారీ నిరసనలు వెల్లువెత్తిన సంగతి విదితమే.

## తవణంపల్లి మండలంలో దారుణ ఘటన

**యువకుడిని హత్యచేసి చెరువుల పడేసిన దుండగులు**

**చిత్తూరు, ఏప్రిల్ 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** చిత్తూరు జిల్లాలోని తవణంపల్లి మండలంలో దారుణ ఘటన వెలుగుచూసింది. మొదలపల్లి గ్రామానికి చెందిన లవ కుమార్ (28) అనే యువకుడిని గుర్తు తెలియని దుండగులు అత్యంత కిరాతకంగా హత్య చేశారు. అనంతరం మృతదేహాన్ని సమీప చెరువులో పడేశారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. స్థానికుల సమాచారం ప్రకారం.. లవకుమార్ గత కొంత కాలంగా అమర్ రాజా కంపెనీలో ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు అతడిని హతమార్చి, మృతదేహాన్ని సమీపంలోని చెరువులో పడేశారు. చెరువులో మృతదేహం తేలడాన్ని గమనించిన గ్రామస్తులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. పాత కక్షల వల్ల ఈ హత్య జరిగిందా? లేక మరేదైనా కారణం ఉందా అనే కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. ఘటనా స్థలంలో వేలిముద్రలు, ఇతర ఆధారాలను సేకరించిన పోలీసులు, నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

## రాజధాని చారిత్రాత్మక నిర్ణయం

**బీజేపీ నాయకులు**



**మచిలీపట్నం, ఏప్రిల్ 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాజధానిగా అమరావతి పై నిర్ణయాన్ని పార్లమెంట్లో ఏకగ్రీవం చేయడాన్ని స్వాగతిస్తూ పట్టణ బిజెపి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ రాజధానిగా పార్లమెంటు ఉభయ సభలు పూర్తిగా సమర్థిస్తూ ఓటింగ్ చేయడం చారిత్రాత్మక నిర్ణయమని బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజలకు సంతోషాన్ని కలిగించే ఏకగ్రీవ నిర్ణయాన్ని పార్లమెంటు ఉభయ సభ సభ్యులు తీసుకోవడం పట్ల ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి రాష్ట్ర ప్రజల సంక్షేమానికి మోడీ ప్రభుత్వం పరిపూర్ణ యొక్క చిత్తశుద్ధిని తెలియజేస్తుందని నాయకులు పేర్కొన్నారు. ఊరి అందరిదీ ఒక దారిని, ఉలిపి కట్టెది వేరొక దారి లాగా వైసిపి పార్టీ ఒకటే పార్లమెంటు వాకౌట్ చేయడం అనేది ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పట్ల రాష్ట్ర ప్రజల సంక్షేమం పట్ల వైసిపి వారికి ఏమాత్రం ఇష్టం లేదని వారిది కపట ప్రేమని , రాష్ట్రాన్ని దోచుకోవడమే వారి లక్ష్యమని రాష్ట్ర ప్రజలు గ్రహించాలని అన్నారు. ఆంధ్రప్రదేశ్ కు రాజధానిగా అమరావతి పట్ల తీవ్ర వ్యతిరేకతయున్న వైసిపి పార్టీకి రాష్ట్ర ప్రజలు భవిష్యత్తులో ఏ మాత్రం అవకాశం ఇవ్వ రాదని బిజెపి నాయకులు పేర్కొన్నారు కూనప రెడ్డి ట్రస్ట్ లో జరిగిన ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కూనపరెడ్డి శ్రీనివాస్, ధూళిపాళ శ్రీరామచంద్రమూర్తి, సూరి శెట్టి హరికృష్ణ, వెన్నాఫణి రాజ్, విన్నకోట సుబ్బారావు, జుజ్జురి ప్రసాదు జొన్నలగడ్డ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగ పెన్షనర్ల బకాయిలను విడుదల చేస్తున్నందుకు సీఎంకి ధన్యవాదాలు తెలిపిన ఏపీఎన్జీ జీవోలు.




**మచిలీపట్నం, ఏప్రిల్ 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఏపీ ఎన్జీ జీవోస్ అసోసియేషన్ కృష్ణా జిల్లా అధ్యక్షులు అకూరి శ్రీనివాసరావ కార్యదర్శి సీతారామయ్య, శుక్రవారం జరిగిన ప్రెస్ మీట్లో మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ శాశ్వత రాజధాని గా అమరావతిని చట్టబద్ధత గుర్తింపు కల్పించే బిల్లు పార్లమెంట్లో ఆమోదం పొందడం గర్వకారణంగా భావిస్తున్నాం అలాగే ప్రభుత్వ ఉద్యోగులకు మరియు పదవీ విరమణ పొందిన పొందిన ఉద్యోగులకు సంబంధించిన పెండింగ్ చెల్లింపుల కోసం మొత్తం 70 59 కోట్లు విడుదలకు ఆమోదం తెలిపినందుకు 184 7.83 కోట్లు జనరల్ ప్రావిడెంట్ ఫండ్ 3411.03 కోట్లు గ్రాట్యూటీ బకాయిలు 1800 కోట్లు పదవి విరమణ పొందిన ఉద్యోగుల లీవెన్కేష్మెంట్ నిమిత్తం222.47 కోట్లు పోలీస్ సిబ్బందికి అదనపు సరెండర్ లీవ్ చెల్లింపు

అలాగే జిపిఎఫ్ కింద 1847.83 కోట్లు అలాగే గ్రూప్ ఇన్సూరెన్స్ ఇప్పటికే విడుదల చేసినారు ఉద్యోగుల సమస్యలపై రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు సానుకూలంగా స్పందించినందుకు పెండింగ్ లో ఉన్న ఆర్థిక అంశాలపై త్వరలో పరిష్కరిస్తామని ముఖ్యమంత్రివర్యులు హామీ ఇచ్చినారు పై అన్ని విషయాలను పరిష్కారం కొరకు ప్రభుత్వ పెద్దలతో పలుమార్లు మాట్లాడి ఉద్యోగులకు రావలసిన బకాయిలను విడుదల చేస్తున్నందుకు రాష్ట్ర ఏపీ ఎన్జీ జీవోస్ అసోసియేషన్ అధ్యక్షులు అలపర్తి విద్యాసాగర్ ప్రధాన కార్యదర్శి డి వి రమణ కి కృష్ణా జిల్లా తరుపున ఏపీ ఎన్జీ జీవోలు అభినందనలు కృతజ్ఞతలు తెలియజేసారు. ట్రెజరర్ శోభన్ బాబు,మాట్లాడుతూ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఒక్కొక్క సమస్యను పరిష్కరిస్తున్నందుకు ఏపీ ఎన్జీ జీవోస్ రాష్ట్ర అధ్యక్షులు ఏ. విద్యాసాగర్ కి, ప్రధాన కార్యదర్శులు, రమణ కి,ఉద్యోగ సమస్యల పై సత్వరమే పరిష్కరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు కి, ధన్యవాదములు తెలియజేసారు. ఆర్గనైసింగ్ సెక్రటరీ హేమ ప్రకాష్, మచిలీపట్నం టౌన్ అధ్యక్షులు లక్ష్మి శ్రీనివాసరావు, కార్యదర్శి,శ్రీధర్, దీపక్, రమేష్, మరియు మహిళా వింగ్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ , అకూరి రమాదేవి,టౌన్ కన్వీనర్ జరీనా, వైస్ ప్రెసిడెంట్, జాహురున్నిసా బేగం, ఏ.రాధిక, అనిత కుమారి, ఏ. విజయ గౌరీ, సుదీప్తిలు పాల్గొన్నారు.

## నేటి మనదేశమ్ సంపాదకీయం

# ట్రంప్‌కు జ్ఞానోదయం అయ్యేనా?

పిల్లికి చెలగాటం..ఎలుకకు ప్రాణ సంకటం అన్న చందంగా ఇప్పుడు అమెరికా, ఇరాన్‌ల యుద్ధం తయారయ్యింది. ప్రపంచం అతలాకుతలం అవుతున్నా..ఇరాన్ కోలుకోలేకుండా చేయడమే లక్ష్యంగా ట్రంప్ మూర్ఖంగా ముందుకు సాగుతున్నారు. ట్రంపం ఏం మాట్లాడుతున్నారో తెలియడం లేదు. ఇంటాబయటా నిరసనలు ఉవ్వెత్తున ఎగిసి పడుతున్నా పట్టించుకోవడం లేదు. ఇకముందు ప్రపంచంలో ఇంధన కొరత తీవ్ర రూపం దాల్చడం ఖాయంగా కనిపిస్తుంది. ఇంధన కొరత అన్ని దేశాలపై తీవ్ర ప్రభావం చూపనుంది. దీనిగురించి ట్రంప్‌కు పెద్దగా బెంగ లేదు. ప్రజలు ఏమయితే ఏమిటన్న ధోరణిలో ఆయన యుద్ధాన్ని ప్రేరేపించారు. ప్రపంచంలో ఏ దేశంలో ఏమి జరిగినా అది మన ఇంట్లో పొయ్యిలో పిల్లి లేవాలా వద్దా అన్నంత ప్రభావం చూపుతోంది. ఇప్పటికే మనదేశంలో హోటల్ పరిశ్రమ కుదేలయ్యింది. ఇలాగే యుద్ధం కొనసాగితే దాని ప్రభావం ఎన్నాళ్లు ఉంటుందో చెప్పలేం.ఎందుకంటే యుద్ధం మొదలు పెట్టి ఇరాన్÷–ను దెబ్బతీసినందుకు గాను ఇరాన్ కూడా గట్టిగానే ఎదురిస్తోంది. అంతు చూస్తామని అమెరికాను హెచ్చరి స్తోంది. తమకు నాలుగు వేల కిలోమీటర్ల దూరంలోని డిగో గార్షియా మీద ఇరాన్ చేసిన దాడిని తక్కువగా అంచనా వేయటం తగదని అమెరికా పూర్వ అధ్యక్షుడు బిల్ క్లింటన్ ప్రస్తుత అధ్యక్షుడు ట్రంప్‌కు హితవు పలుకుతున్నాడంటే ఇక పైనైనా ఆచితూచి నిర్ణయం తీసుకోవాల్సిన ఆవశ్యకతను చెప్పడమే! అత్యంత అధునాతన ఎఫ్ 35 యుద్ధ విమానంపై ఇరాన్ దాడి చేసిందన్న వార్త ప్రపంచ దేశాలను ఉలికిపాటుకు గురిచేసింది. యుద్ధ తంత్ర నిపుణులు ఇరాన్ బలిమి లెక్కింపులో అమెరికా వ్యూహాన్ని తప్పుపట్టారు. తాజా వ్యూహంలో హర్మూజ్ జలసంధి ఇరాన్ పట్టు సడలించేందుకు ట్రంపు నానా యాతన పడుతున్నారు. అది సాధ్యం కావడం లేదు. ఇరాన్ తో సత్సంబంధాలు నెరపుతున్న భారత్ వంటి దేశాల నౌకలకే సేఫ్ ప్యాసేజ్ లభించింది. అయినా ప్రపంచవ్యాప్తంగా ఉన్న చమురు సంక్షోభంలో భారత్ కూడా చిక్కుకోక తప్పడంలేదు. కొన్ని నౌకలు భారతీయ పోర్టులకు చేరినా దేశవ్యాప్తంగా పెట్రోలియం ఉత్పత్తుల కొరత బ్లాక్ మార్కెట్, రవాణా వాహనాలు చార్జీలు పెంపు వంటి అంశాల నుంచి ఎప్పటికి సాధారణ స్థాయికి చేరుకుంటుందో చెప్పలేం. హర్మూజ్ జలసంధి ఇరాన్ పట్టు నుంచి తప్పించడానికి వెళ్తున్న యుద్ధ విమానాలకు శ్రీలంక అనుమతి నీయకపోవడంతో అమెరికా ప్రయత్నాలు బెడిసి కొట్టాయి. హర్మూజ్ పై సైనిక చర్యకు ముందుకు రాని నాటో కూటమి దేశాలతో, తమ భద్రతను తామే ఏర్పాటు చేసుకోవాలని ట్రంప్ చేతులెత్తేశారు. ఆయన నిర్ణయాలకు మిత్ర దేశాల వత్తాసు లభించడం లేదు. ఇరాన్ వార్ కారణంగా ఖతార్ ఎల్ఎన్జి ఎగుమతులకు 5 ఏళ్ల పాటు దారి దొరికే పరిస్థితి లేదని తేలిపోయింది. ఇరాన్, అమెరికా ఇజ్రాయిల్ యుద్ధం మానవ రహిత కార్యాచరణగా సాగుతోంది. కేవలం ఆయా దేశాల మౌలిక వనరుల విచ్ఛిత్తి పైనే దాడిగా చెప్పుకోవాలి. నెల రోజులుగా జరుగుతున్న యుద్ధాన్ని విశ్లేషిస్తున్న వారెవరైనా ఈ యుద్ధం ఆగేందుకు దారి లేదని, ఆపేందుకు ఎవరూ ముందుకు రావడంలేదని వారి వైఖరులే స్పష్టపరుస్తున్నాయి. తాజాగా ఇరాన్ అమెరికా ఉద్రిక్తతలు హిందూ మహా సముద్రానికి విస్తరించాయి. అమెరికా వ్యూహాత్మక సైనిక స్థావరం డిగో గారియాను ఇరాన్ లక్ష్యం చేసుకోవడంతో అమెరికాలో కలవరం బయలుదేరింది. ఇరాన్ వద్ద ఇలాంటి శక్తివం తమైన బాంబులున్నట్లు అంచనా వేయడంలో అమెరికా దాదాపు విఫలమైనట్లే. ఇప్పుడు అమెరికా ఆత్మరక్షణలో పడిపోయింది. అయినా ట్రంప్ తన అహంకారాన్ని వీడడం లేదు. యురేనియం శుద్ధి చేసే సామర్థ్యం ఇరాన్‌కు లేదని, అలాగే బాలిస్టిక్ క్షిపణులు తయారు చేసే సామర్థ్యం కూడా లేకుండా చేసి తాము విజయం సాధించినట్లేనని ఈ మధ్యనే ఇజ్రాయిల్ ప్రధ్రాని బెంజి మెన్ నెతన్యాహు ఒక సందర్భంలో సంతృప్తి వ్యక్తం చేశారు. ఇరాన్‌ను అణ్వస్త్ర తయారీ వరకు వెళ్లకుండా చేయడమే తమ అంతిమ లక్ష్య మని అమెరికా ఇజ్రాయిల్ ప్రకటించుకున్నాయి. అదే నిజమైతే ఇప్పుడు వాళ్ళు ఆ దిశగా విజయం సాధించినట్లే. ఇజ్రాయిల్ లక్ష్యం అదే అయినప్పుడు మరికొంత కాలం యుద్ధాన్ని సాగతీయడం ఉభయులకూ, ఈ ప్రపంచానికీ మంచిది కాదు. టెహ్రాన్‌పై అమెరికా– ఇజ్రాయిల్ సంయుక్తంగా చేపట్టిన యుద్ధం 34వ రోజుకు చేరుకుంది. ఇరుదేశాల పరస్పర దాడుల వల్ల పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తుతున్నాయి. ఇస్లామిక్ రిపబ్లిక్‌పై అమెరికా జరిపే ఏ భూతల దాడినైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నామని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మొహమ్మద్ బాగేర్ గాలిబాఫ్ ప్రకటించారు. ఇందుకోసం 7 మిలియన్ల ఇరానీయులు సిద్ధంగా ఉన్నారని ప్రకటించారు. అమెరికాతో సంప్రదింపుల భాగస్వామిగా పేరు వినిపిస్తున్న మహమ్మద్ బఘేర్ ఖాలిబాఫ్, యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి అమెరికాకు సవాలు విసురుతూ వరుసగా ఆన్‌లైన్ పోస్టులు పెడుతున్నారు. అమెరికా– ఇజ్రాయిల్ తమపై అకారణంగా దాడులు చేస్తున్నాయని ఇరాన్ సుప్రీం నేత మొజ్తాబా ఖమేనీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దాడుల కారణంగా దెబ్బతిన్న మౌలిక సదుపాయాలను తిరిగి పునరుద్ధరించడానికి నడుం బిగించాలని ఆయన పిలుపునిచ్చారు. ఇందుకోసం దేశవ్యాప్త కార్యక్రమం చేపట్టాలని నిర్దేశించారు. అమెరికా– ఇజ్రాయిల్ తమ దేశంపై కొనసాగిస్తోన్న నీచమైన, దురాక్రమణ దాడులను మొజ్తాబా తీవ్రంగా ఖండించారు. ఇరాన్ అభివద్ధిని విస్తరించడం, ఉజ్వల భవిష్యత్తుకు ప్రయత్నాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. మొత్తంగా అమెరికాను ఎదిరించే సాహసం ఇరాన్ చేస్తోంది. ఇది అమెరికాకు ముఖ్యంగా ట్రంప్‌కు గుణపాఠం కావాలి.

# పోలీసులపై అనుచిత వ్యాఖ్యలు

## మాజీమంత్రి పేర్ని నానిపై పోలీస్ కేసు

**మచిలీపట్నం, ఏప్రిల్ 3 (ఆర్ఎన్ఎ):** మాజీ మంత్రి, వైసీపీ నేత పేర్ని నానిపై చిలకలపూడి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. గురువారం మచిలీపట్నం కొబ్బరి తోటలో అక్రమ నిర్మాణాల కూల్చివేత ఘటన నేపథ్యంలో పోలీసులపై మాజీ మంత్రి అనుచిత వ్యాఖ్యలు చేశారు. చిలకలపూడి సీఐ పరమేశ్వరరావును బాడీ షేమింగ్ చేస్తూ అవమానించారు. అంతేకాకుండా పోలీసులను బెదిరించారు. పోలీసుల పట్ల మాజీ మంత్రి వ్యవహరించిన తీరుపై కృష్ణా జిల్లా పోలీస్ అధికారుల సంఘం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. పోలీస్ అధికారుల సంఘం ఫిర్యాదు మేరకు చిలకలపూడి పోలీస్ స్టేషన్‌లో పేర్ని నానిపై పోలీసులు కేసు నమోదు చేశారు. నిన్న మచిలీపట్నం కొబ్బరితోటలో అక్రమ నిర్మాణాలను మున్సిపల్ అధికారులు కూల్చివేసిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంపై స్పందించిన పేర్ని నాని పోలీసులపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఎవ్వరినీ వదలమని, తమ ప్రభుత్వం వచ్చాక అంతు చూస్తామంటూ పోలీసులను ఉద్దేశించి పేర్ని నాని వ్యాఖ్యలు చేశారు.

# యుఎస్ అటార్నీ జనరల్ పామ్ బోండీపై వేటు

## ఎప్‌స్టీన్ వ్యవహారంలో సరిగా వ్యవహరించలేదన్న ఆరోపణ



**వాషింగ్టన్,ఏప్రిల్3(ఆర్ఎన్ఎ):** యుఎస్ అటార్నీ జనరల్ పామ్ బోండీని ఆ పదవి నుండి ట్రంప్ యంత్రాంగం గురువారం తొలగించినట్లు వైట్‌హౌస్ తెలిపింది. అంతర్జాతీయంగా వివాదాస్పదమైన లైంగిక నేరగాడు జెఫ్రీ ఎప్‌స్టీన్‌కు సంబందించిన దర్యాప్తు పత్రాల నిర్వహణ సహా పలు అంశాలపై ట్రంప్ అసహనం వ్యక్తం చేసినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ముఖ్యంగా తాను దర్యాప్తు ఎదుర్కోవాలని కోరుకున్న విమర్శకులు, ప్రత్యర్థులపై అభియోగాలు మోపడంలో బోండీ తగిన విధంగా వ్యవహరించకపోవడం ట్రంప్‌ను తీవ్ర అసహనానికి గురిచేసినట్లు తెలిపాయి. పామ్ బోండీ పదవి నుండి తొలగింపబడిన రెండవ సీనియర్ అధికారి.

మార్చి5న హోంల్యాండ్ సెక్యూరిటీ కార్యదర్శి క్రిస్టీ నోమ్‌ను ట్రంప్ పదవి నుండి తొలగించిన సంగతి తెలిసిందే. ఆ శాఖ నిర్వహణ తీరుపైనా, ట్రంప్ వలసవిధాన అజెండాపై వచ్చిన తీవ్ర విమర్శలతో క్రిస్టీ నోమ్‌ను పదవి నుండి తొలగించారు. యుఎస్ అటార్నీ జనరల్‌గా బోండీ తన పదవీ కాలంలో ట్రంప్ అజెండాకు గట్టి మద్దతుదారుగా నిలిచారు. న్యాయశాఖ తన దర్యాప్తులో వైట్‌హౌస్ నుండి స్వతంత్రంగా వ్యవహరించే సుదీర్ఘ సాంప్రదాయాన్ని ఇది నాశనం చేసింది. ట్రంప్ మిత్రులు, కొంతమంది రిపబ్లికన్ చట్టసభ్యులు సహా ఎప్‌స్టీన్ ఫైల్స్‌పై వచ్చిన విమర్శలు ఆమెను చుట్టుముట్టాయి. పలు రాజకీయ శక్తులు, కార్పోరేట్ అధిపతులు, ఆర్థిక సంస్థలు, పలుకుబడి కలిగిన వ్యక్తులు, కుబేరులతో ఎప్‌స్టీన్ సంబంధాలను అమెరికా న్యాయవ్యవస్థ డోజ్ జరిపిన దర్యాప్తు రికార్డులు వెల్లడికాకుండా అడ్డుకున్నారని, దుర్వినియోగం చేశారని ఆమెపై ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో ఈ అంశం ట్రంప్‌కు రాజకీయంగా తలనొప్పులు సృష్టించడంతో పాటు దశాబ్దాల క్రితం ముగిసిపోయిందని ఆయన ప్రకటించిన ఎప్‌స్టీన్‌తో సంబంధంపై తిరిగి నిశిత దర్యాప్తు చేపట్టేలా చేసింది. అయితే ఆమె తొలగింపు న్యాయశాఖలో భారీ మార్పులకు దారితీయవచ్చని పలువురు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. ట్రంప్‌ను లక్ష్యంగా చేసుకున్న వారిపై డోజ్‌ను ప్రయోగించే దిశగా నూతన యత్నాలు చేపట్టవచ్చని పేర్కొన్నారు.

# స్కూల్ ఫీజుల నియంత్రణ చట్టం చేయాలి

## ఆనాడు మాట్లాడిన రేవంత్ ఇప్పుడు మాట్లాడడం లేదు... బీఆర్ఎస్ పేరు ఖాళీగా ఉంది..ఎవరైనా వాడుకోవచ్చు

## జాగృతి అధ్యక్షురాలు కవిత సంచలన వ్యాఖ్యలు



**హైదరాబాద్,ఏప్రిల్3(ఆర్ఎన్ఎ):** రాష్ట్రంలో స్కూల్ ఫీజుల గొడవ నడుస్తోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో 39,640 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయని తెలిపారు. వీటిలో 12,061 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయన్నారు. సీబీఎస్సీ సెంట్రల్ సిలబస్ ఉన్న స్కూల్స్‌లో 25 నుంచి 30 శాతం ఫీజులు పెంచి ఇప్పటినుంచే వసూలు చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ ఉన్నప్పుడు ఫీజు నియంత్రణ చట్టం చేయాలని రేవంత్ రెడ్డి పదే పదే మాట్లాడారని గుర్తుచేశారు. ఎవరెంత తిన్నారంటూ అసెంబ్లీలో చర్చ చేసుకున్నారే తప్ప ఫీజుల నియంత్రణపై మాట్లాడలేదని విమర్శించారు. ప్రత్యేక అసెంబ్లీ నిర్వహించి ఫీజు నియంత్రణ చట్టం వెంటనే తేవాలని కవిత డిమాండ్ చేశారు. ఈ విషయంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలన్నారు. ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాలు ఫీజులను పెంచుతున్నాయే తప్ప టీచర్లకు మాత్రం జీతాలు పెంచరని విమర్శించారు. ప్రైవేట్ కాలేజీల్లో ఆహార నాణ్యతను ప్రభుత్వం పట్టించుకోదా అని ప్రశ్నించారు. ప్రైవేట్ పాఠశాలలు, ఆసుపత్రులను సీఎం ప్రారంభిస్తున్నారని... వాళ్ళ దోపిడిని ఎంకరేజ్ చేస్తున్నారా అంటూ నిలదీశారు. ప్రైవేట్ స్కూల్స్ దోపిడీని కంట్రోల్ చేయాలని ప్రభుత్వాన్ని కవిత డిమాండ్ చేశారు. ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే స్కూల్స్ ముందు ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. 'అన్ని శాఖలకు ముఖ్యమంత్రే మంత్రిగా ఉండటం మన కర్మ' అంటూ వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ హయాంలో తనను నిజామాబాద్‌కు పరిమితం చేశారని అన్నారు. ఆంధ్రా, నార్త్ ఇండియా వాళ్ళు ఇక్కడ విద్యా సంస్థలు నెలకొల్పినా తెలంగాణ వాళ్ళకే అవకాశం ఇవ్వాలని కవిత డిమాండ్ చేశారు.అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తున్న స్కూల్ యాజమాన్యాలపై ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. తక్షణమే ప్రభుత్వం ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని.. అధిక ఫీజుల వసూళ్లను కట్టడి చేయాలని కోరారు.తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పాత పేరు, కొత్త అజెండాతో ప్రజల ముందుకు వస్తానని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) పేరు ఫ్రీ అయిందని.. ఇప్పుడు దాన్ని ఎవరైనా వాడుకోవచ్చన్నారు. ఆచార్య జయశంకర్ సిద్దాంతాల ప్రకారమే తమ పార్టీ నడుస్తుందని చెప్పారు. తమ పార్టీకి బిహార్ సిద్దాంతకర్త అంటూ ఎవరూ లేరన్నారు. బీఆర్ఎస్ ప్రస్తుతం నిద్రావస్థలో ఉందని విమర్శించారు.

# అమరావతిపై పరస్పర విరుద్ధ ప్రకటనలు

❑జగన్ మానసిక పరిస్థితిపై ఆందోళన

❑ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు విమర్శలు



**విశాఖపట్నం,ఏప్రిల్3(ఆర్ఎన్ఎ):** అమరావతిపై జగన్ మాట్లాడిన మాటలు చూస్తే ఆయన మానసిక పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతోందని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. అమరావతిపై జగన్‌లా ఇన్ని ప్రకటనలు చేసిన వ్యక్తి ప్రపంచంలో మరెవరూ ఉండరంటూ ఎమ్మెల్యే వ్యాఖ్యలు చేశారు. మతిస్థిమితలం లేని వ్యక్తిలా ఆయన మాటలు ఉన్నాయని అన్నారు. పరస్పర విరుద్ధంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. పార్లమెంట్‌లో అమరావతి రాజధాని బిల్లు ఆమోదంపై హర్షం వ్యక్తం చేస్తూ కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు . ఈ సందర్భంగా మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి వివిధ సందర్భాల్లో రాజధాని గురించి మాట్లాడిన వ్యాఖ్యలను ఎమ్మెల్యే విడుదల చేశారు. ప్రతిపక్ష నాయకుడిగా అమరావతిని అంగీకరించారని.. గెలిచిన తర్వాత మూడు రాజధానులు అన్నారని గంటా శ్రీనివాస్ తెలిపారు. అమరావతి తీర్మానంపై ప్రత్యేక అసెంబ్లీ సమావేశానికి కూడా హాజరు కాలేదన్నారు. పార్లమెంట్‌లో అమరావతికి వ్యతిరేకంగా ఉన్న ఏకైక పార్టీ వైసీపీ అని తెలిపారు. మొన్నటి వరకు ఉత్తరాంధ్ర అన్న జగన్.. ఇప్పుడు మావిగన్ అని అంటున్నారని అన్నారు. మాజీ సీఎంకు ఏ అంశంపైనా ఒక స్థిరమైన అభిప్రాయం లేదని ఎమ్మెల్యే విమర్శించారు. వైసీపీకి 151 సీట్ల నుంచి 11 సీట్లకు ప్రజలు తీర్పు ఇచ్చినా జగన్ మారడం లేదన్నారు ఎమ్మెల్యే. ఏప్రిల్ 15వ తేదీ లోపు గూగుల్ శంకుస్థాపన చేయొచ్చని వెల్లడించారు. అమరావతి కలల రాజధానిని సాధించుకున్నామని తెలిపారు. గత ప్రభుత్వం అమరావతి ప్రజలను ఎన్ని ఇబ్బందులు పెట్టిందో అంతా చూశారన్నారు. రాష్ట్రపతి ఆమోదంతో జగన్ రాజధాని అమరావతిని ఇంచు కూడా కదపలేరని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు స్పష్టం చేశారు.

# దొడ్డి కొమురయ్యకు కెసిఆర్ నివాళి

**హైదరాబాద్,ఏప్రిల్3(ఆర్ఎన్ఎ):** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య జయంతి సందర్భంగా వారికి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఘన నివాళి అర్పించారు. ప్రజా వ్యతిరేక పాలన మీద తెలంగాణ ప్రజల తిరుగుబాటుకు సంకేతంగా నిలిచిన కొమరయ్య గారి అమరత్వం, నాటి రాచరిక పాలకుల నుంచి నేటి ప్రజా వ్యతిరేక పాలకుల మీద సాగుతున్న ప్రజా పోరాటలకు స్ఫూర్తిగా నిలిచిందని కేసీఆర్ తెలిపారు. తెలంగాణ ఉద్యమాన్ని నడిపించి, రాష్ట్రాన్ని సాధించి, అనంతరం పదేండ్లపాటు బాలారిష్టాలను అధిగమించి, స్వయం పాలనను దేశానికే ఆదర్శంగా నిలబెట్టుకోవడంలో అమరుల త్యాగాల స్ఫూర్తి ఇమిడి ఉన్నదని కేసీఆర్ అన్నారు.

# కువైట్ చమురుశుద్ధి కర్మాగారంపై దాడి

## డ్రోన్లతో విరుచుకు పడ్డ ఇరాన్... పెద్ద ఎత్తున మంటలు చెలరేగినట్లు కువైట్ ప్రకటన

**కువైట్ సిటీ, ఏప్రిల్ 3 (ఆర్ఎన్ఎ):** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు రోజురోజుకు తీవ్రమవుతున్నాయి. శుక్రవారం కువైట్ లోని ప్రధాన చమురుశుద్ధి కర్మాగారం మీనా అల్–అహ్మదిపై ఇరాన్ డ్రోన్లతో విరుచుకుపడింది. దీంతో ఆ ప్రాంతంలో భారీఎత్తున మంటలు చెలరేగినట్లు కువైట్ పెట్రోలియం కార్పొరేషన్ ప్రకటించింది. మంటలు అదుపు చేయడానికి అగ్నిమాపక సిబ్బంది కృషి చేస్తున్నారని పేర్కొంది. ఈ దాడిలో ఎటువంటి ప్రాణనష్టం సంభవించలేదని తెలిపింది. ప్రపంచంలోని అతిపెద్ద చమురు శుద్ధి కర్మాగారాల్లో మీనా అల్–అహ్మది ఒకటి. కువైట్ చమురు ఉత్పత్తికి ఇది చాలా కీలకం. మీనా అల్–అహ్మది కర్మాగారం నుంచి రోజుకు 3,46,000 బ్యారెళ్ల చమురును ఉత్పత్తి చేస్తారు. దాదాపు లక్షల బ్యారెళ్ల మేర డీజిల్, ఇతర శుద్ధి చేసిన ఇంధనాలను ఆసియా, యూరప్‌లోని మార్కెట్లకు ఎగుమతి చేస్తూ.. ప్రభుత్వానికి కీలకమైన ఆదాయ వనరుగా నిలుస్తోంది. ఈ కర్మాగారం లేకపోతే అక్కడ ఉత్పత్తి అయ్యే చమురును శుద్ధి చేయలేక బావులను మూసివేయాల్సిన పరిస్థితి తలెత్తుతుంది. ఇక్కడినుంచి భారత్‌తో సహా ఇతర ప్రపంచ దేశాలు చమురు దిగుమతి చేసుకుంటాయి. పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రస్తుతం భారత్.. కువైట్ నుంచి చమురు దిగుమతులు నిలిపివేసింది. జాతీయ ఆయిల్ కంపెనీపై డ్రోన్ దాడి జరిగినట్లు కువైట్ న్యూస్ ఏజన్సీ శుక్రవారం పేర్కొంది. దీంతో పలు యూనిట్లలో మంటలు చెలరేగాయని తెలిపింది. ఉదయం మినా అల్–అహ్మదీ ర్గి÷నైరీ లక్ష్యంగా డ్రోన్ దాడి జరిగిందని కువైట్ పెట్రోలియం కార్పోరేషన్ (కెపిసి) మీడియాకు తెలిపింది. ఫలితంగా పలు యూనిట్లలో మంటలు చెలరేగాయని, అత్యవసర బృందాలు సహాయక చర్యలు చేపడుతున్నాయని పేర్కొంది. గల్ఫ్ భూభాగంపైకి ప్రయోగించిన క్షిపణులు, డ్రోన్‌లను వైమానిక రక్షణవ్యవస్థ సమర్థవంతంగా అడ్డుకుంటుందని కువైట్ సైన్యం ఒక ప్రకటనలో తెలిపింది. దేశవ్యాప్తంగా సైరన్‌లు మోగుతున్నాయని బహ్రెయిన్ అంతర్గత మంత్రిత్వ శాఖ ప్రకటించింది. ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని ఆదేశాలు జారీ చేసింది. మరిన్ని వివరాలు వెల్లడించేందుకు నిరాకరించింది.

# రాఘవచద్దాను తొలగిస్తూ ఆప్ నిర్ణయం

## సభలో మాట్లాడే అవకాశం ఇవ్వరాదని లేఖ... ఆప్ తీరుపై మండిపడ్డ రాఘవ్ చద్దా ... ప్రజా సమస్యలపై గొంతెత్తితే తట్టుకోలేరా?... వీడియో విడుదల చేసిన రాఘవ్ చద్దా

**న్యూఢిల్లీ,ఏప్రిల్3(ఆర్ఎన్ఎ):** రాజ్యసభలో ఆమ్‌ఆద్మీ పార్టీ ఉపనేతగా ఉన్న రాఘవ్ చద్దాను ఆ పదవి నుంచి ఆప్ తొలగించడం తీవ్ర వివాదాస్పదమైంది. దీనిపై ఆప్ ఎంపీ రాఘవ్ చద్దా తాజాగా స్పందించారు. తానేం తప్పు చేశానంటూ పార్టీని బహిరంగంగా ప్రశ్నించారు. ఇలాంటి ప్రయత్నాలతో తన గళాన్ని అణచివేయగలరేమో గానీ.. తనను ఓడించలేరంటూ ఓ వీడియో సందేశం విడుదల చేశారు. పార్లమెంట్‌లో నాకు ఎప్పుడు మాట్లాడే అవకాశం లభించినా.. ప్రజా సమస్యలనే లేవనెత్తుతా. బహుశా నేను ప్రస్తావించే అంశాలను సభలో సాధారణంగా చర్చించరేమో. కానీ, ప్రజా సమస్యలను ఎత్తిచూపడం ఏమైనా నేరమా అని నిలదీశారు. నేనేమైనా తప్పు చేశానా? పార్లమెంట్‌లో నాకు మాట్లాడే అవకాశం ఇవ్వొద్దని మా పార్టీ స్వయంగా రాజ్యసభ సెక్రటరీకి చెప్పింది. అందుకే ఈ రోజు నేను ఈ ప్రశ్నలు అడగాల్సి వచ్చింది. ఎయిర్‌పోర్టుల్లో ఆహార ధరలు, గిగ్ వర్కర్ల సమస్యలు, టోల్ ప్లాజా దోపిడీ, టెలికాం కంపెనీల రీఛార్జ్ విధానాల సమస్యలను లేవనెత్తితే.. అది ఆమ్‌ఆద్మీ పార్టీకే ప్రయోజనం కదా అని అన్నారు. మొన్నటికి మొన్న వివిధ రకాల పన్నులుపై నిలదీశారు. దీనివల్ల పార్టీకి ఏం నష్టం జరుగుతోంది? ఎందుకు నన్ను మాట్లాడకుండా



అడ్డుకుంటున్నారు? ఇలాంటి చర్యలతో నా గళాన్ని మీరు అణచివేయగలరు. కాని, ఇది నా ఓటమి కాదు. ప్రజలు నా పక్షాన ఉన్నారు. వారికోసం ఎంత దూరమైనా వెళ్తా. నేను నది లాంటి వాడిని. సమయం వచ్చినప్పుడు వరదలా విరుచుకుపడతా అని రాఘవ్ చద్దా తన వీడియోలో పేర్కొన్నారు. రాజ్యసభలో ఆమ్‌ఆద్మీ పార్టీ డిప్యూటీ లీడర్‌గా రాఘవ్ చద్దాను తొలగించిన ఆప్.. ఆ హోదాలో మరో ఎంపీ అశోక్ మిత్తల్‌ను నియమించింది. ఆప్ నిర్వహిస్తున్న కార్యకలాపాలకు చద్దా దూరంగా ఉంటుండటం, పార్టీ కార్యక్రమాలపై స్పందించకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. రాఘవ్ చద్దా భాజపాలో చేరనున్నట్లు ఊహాగానాలు వినిపిస్తోన్న వేళ ఈ పరిణామాలు చోటుచేసుకోవడం తీవ్ర చర్చనీయాంశ మైంది.ఎంపి రాఘవ చద్దాని ఉపనాయకుడి పదవి నుంచి తొలగించాలని గురువారం రాజ్యసభ సచివాలయానికి ఆ పార్టీ లేఖ రాసింది. సభలో రాఘవ చద్దాని మాట్లాడనివ్వకూడదని కూడా ఆ లేఖలో ఆప్ పేర్కొంది. దీనిపై ఆప్ ఎంపి రాఘవ్‌చద్దా శుక్రవారం స్పందించారు. పార్లమెంటులో ప్రజా సమస్యలను లేవనెత్తడం నేరమా? నేను ఏదైనా తప్పు చేశానా? అని ఆప్‌ని ప్రశ్నించారు. ఈ మేరకు ఓ వీడియోను ఆయన శుక్రవారం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. నాకు ప్రజల మద్దతు ఉంది. నా మౌనాన్ని నా ఓటమిగా పొరపాటు పడకండి అని రాఘవ్ చద్దా వీడియోలో తెలిపారు.

## భక్తులతో కిక్కిరిసిన అంకమ్మ తల్లి ఆలయం...



**నందిగామ ఏప్రిల్ 03( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** వీరులపాడు మండలం జయంతి గ్రామంలో అంకమ్మ తల్లి తిరుణాల మహోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా కొనసాగుతోంది. ఈ సందర్భంగా పరిసర ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయి పండుగ వాతావరణం నెలకొంది. మహిళలు, యువతులు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పిస్తూ భక్తి ప్రదర్శించారు. మహోత్సవం సందర్భంగా గ్రామంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రాత్రివేళ ప్రత్యేక అలంకరణలతో దేవాలయం వెలుగులీనుతూ ఆకట్టు కుంటోంది. భక్తుల రద్దీ దృష్ట్యా నిర్వాహకులు తాగునీరు, పార్కింగ్, భద్రత వంటి సౌకర్యాలను కల్పించారు. ఈ సందర్భంగా దేవస్థానం కార్యదర్శి మాట్లాడుతూ, మహోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు గ్రామస్థులందరూ సహకరిస్తున్నారని తెలిపారు. భక్తులు క్రమశిక్షణతో దర్శనం చేసుకోవాలని, ఏర్పాట్లకు సహకరించాలని కోరారు. పోలీసులు కూడా బందోబస్తు నిర్వహిస్తూ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు చేపట్టారు.

## జగ్గయ్యపేటలో గుడ్ ఫ్రైడే భక్తి జ్వాల...



**నందిగామ ఏప్రిల్ 03( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** గుడ్ ఫ్రైడే సందర్భంగా జగ్గయ్యపేట పట్టణంలో ఆర్సీయం చర్చి ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రధాన వీధుల గుండా ఏసుక్రీస్తు సిలువను ఊరేగింపుగా ప్రదర్శించారు. భక్తులు ప్రార్థనలు చేస్తూ, కీర్తనలు ఆలపిస్తూ ర్యాలీలో పాల్గొని భక్తిశ్రద్ధలు చాటుకున్నారు. జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ ర్యాలీలో పాల్గొని ఏసుక్రీస్తు సిలువను మోసి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అనంతరం నిర్వహించిన ప్రార్థనల్లో పాల్గొని, క్రీస్తు ఆశీర్వాదాలతో ప్రజలు సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షించారు. ప్రేమ, క్షమ, సహనం వంటి విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని సూచించారు ర్యాలీ సందర్భంగా పట్టణంలో భక్తి వాతావరణం నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన క్రైస్తవులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం సజావుగా సాగేందుకు పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో చర్చి ప్రతినిధులు, మత పెద్దలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. గుడ్ ఫ్రైడే ప్రాముఖ్యతను వివరిస్తూ సమాజంలో శాంతి, సౌహార్ద్రత పెంపొందించాలని కోరారు.

## 108 అంబులెన్స్‌లోనే సుఖప్రసవం...



**నందిగామ ఏప్రిల్ 03( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** పెనుగంచిప్రోలుకు చెందిన 25 ఏళ్ల రాజేశ్వరి అనే గర్భిణికి పురిటినొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు తొలుత స్థానిక ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం జగ్గయ్యపేటకు తీసుకెళ్తుండగా మార్గమధ్యంలోనే నొప్పులు తీవ్రతరమయ్యాయి. ఈ పరిస్థితిని గమనించిన 108 అంబులెన్స్ సిబ్బంది చాకచక్యంగా స్పందించి వాహనంలోనే సురక్షితంగా ప్రసవం నిర్వహించారు. అత్యవసర పరిస్థితుల్లో సిబ్బంది చూపిన సేవాభావం, సమయస్ఫూర్తి వల్ల గర్భిణి సుఖప్రసవం జరగడంతో పాటు తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు అనంతరం వారిని సమీప ఆసుపత్రికి తరలించి వైద్య పరీక్షలు నిర్వహించారు. తల్లీబిడ్డ ఆరోగ్యం బాగుండటంతో కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. 108 సిబ్బంది చేసిన సేవలను ప్రశంసిస్తూ వారికి కృతజ్ఞతలు తెలిపారు.

## జలపవారిగూడెంలో విషాదఛాయలు



**కామవరపుకోట ఏప్రిల్ 03( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** కామవరపుకోట మండలం జలపవారిగూడెంలో విషాదఛాయలు అలుముకున్నాయి. శుక్రవారం తెల్లవారుజామున చౌటుప్పల్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో జలపవారిగూడెం గ్రామానికి చెందిన పల్లా నవీన్, సాధనాల స్వామి మృతి చెందారు. బతుకుతెరువు కోసం కొబ్బరి బోండాల వ్యాను కిరాయి నిమిత్తం వెళ్లిన వీరు మార్గమధ్యంలోనే అసువులు బాయటం వారి కుటుంబాల్లో విషాదాన్ని నింపింది. నవీన్‌కు భార్య, ఏడాది వయసు కలిగిన బిడ్డ ఉన్నారు.

## ఎండల వేడి మధ్య భక్తులకు ఊరట..
## తిరుపతమ్మ ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు...



**నందిగామ ఏప్రిల్ 03( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** శుక్రవారం సందర్భంగా పెనుగంచిప్రోలులోని శ్రీ గోపయ్య సమేత తిరుపతమ్మ అమ్మవారి ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం నుంచే ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయి ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ముఖ్యంగా శుక్రవారం కావడంతో మహిళలు అధిక సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉండటంతో భక్తులు ఇబ్బందులు పడకుండా ఆలయ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఆలయ పరిసరాల్లోని సీసీ రోడ్డుపై వేడి ప్రభావం తగ్గించేందుకు వాటర్ ట్యాంకర్ ద్వారా ఎప్పటికప్పుడు నీటిని చల్లి చల్లబరుస్తున్నారు. దీంతో భక్తుల పాదాలు కాలకుండా ఉండటమే కాకుండా కొంత ఊరట కలుగుతోంది. ఈ ఏర్పాట్లను ఆలయ అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూస్తున్నారు. ఉత్సవ కమిటీ ఛైర్మన్ చెంచు రమేశ్ స్వయంగా ఏర్పాట్లను సమీక్షిస్తూ తాగునీరు, క్యూలైన్లు, శుభ్రత వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. భక్తులు ఆలయ అధికారుల చొరవను అభినందిస్తూ, ఇలాంటి చర్యలు తీసుకోవడం వల్ల దర్శనం సౌకర్యవంతంగా సాగుతోందని తెలిపారు. ఎండల మధ్య కూడా అధికారులు తీసుకున్న జాగ్రత్తలు భక్తులకు ఉపశమనం కలిగిస్తున్నాయి.

## ప్రభుత్వ ఆసుపత్రుల్లో క్యూ కష్టాలకు చెక్




**విజయవాడ , ఏప్రిల్ 03( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** వాట్సాప్‌లోనే 'ఓపీ' స్లిప్!'మన మిత్ర' సేవలు అందుబాటులోకి । 95523 00009 నంబర్‌కు 'ఎఱ' పంపితే చాలు విజయవాడ అర్బన్ ప్రతినిధి : ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఇక క్యూ కష్టాలు ముగిసేలా!

'మన మిత్ర' వాట్సాప్ సేవలతో ఇంటి నుంచే ఓపీ స్లిప్ బుక్ చేసుకోండి.

బుకింగ్ విధానం ఇలా..

ప్రజలు తమ మొబైల్‌లో 95523 00009 నంబర్‌ను సేవ్ చేసుకుని, వాట్సాప్‌లో "ఎఱ" అని మెసేజ్ పంపాలి. వెంటనే చాట్‌బాట్ స్పందించి జిల్లాలు, ఆసుపత్రులు, వివిధ వైద్య విభాగాలు మరియు అందుబాటులో ఉన్న వైద్యుల జాబితాను చూపిస్తుంది. రోగులు తమకు అవసరమైన విభాగం, అనుకూలమైన తేదీ, సమయాన్ని ఎంపిక చేసుకుంటే వెంటనే ఓపీ టోకెన్ జనరేట్ అవుతుంది.

ఒకే క్లిక్‌తో మరిన్ని సేవలు:

ఈ వాట్సాప్ సేవ కేవలం ఓపీ బుకింగ్‌కే పరిమితం కాకుండా, మరిన్ని సౌకర్యాలను కూడా అందిస్తోంది:

ఎన్‌టీఆర్ వైద్యసేవ: ఈ పథకం కింద లభించే సేవలు, అర్హతల వివరాలు తెలుసుకోవచ్చు.

రక్త నిల్వలు: అత్యవసర సమయంలో ఏ గ్రూపు రక్తం ఏ ఆసుపత్రిలో అందుబాటులో ఉందో వెంటనే తెలుసుకోవచ్చు.

మందుల లభ్యత: ఆసుపత్రుల్లో స్టాక్‌లో ఉన్న మందుల వివరాలు పొందవచ్చు.

ఆరోగ్య పథకాలు: ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ ఆరోగ్య కార్యక్రమాల వివరాలు కూడా అందుబాటులో ఉంటాయి.


ప్రజలకు వైద్య సేవలను మరింత చేరువ చేయడమే మా లక్ష్యం. ఈ డిజిటల్ విధానం వల్ల సమయం ఆదా కావడమే కాకుండా ఆసుపత్రుల్లో రద్దీ కూడా తగ్గుతుంది" అని వైద్య ఆరోగ్య శాఖ తెలిపారు.

ఈ కొత్త విధానానికి ప్రజల నుంచి మంచి స్పందన వ్యక్తమవుతోంది.

ఆపుకోలేని నవ్వు.. అరుదైన జబ్బు: ఎయిమ్స్ జోధ్‌పూర్ వైద్యుల అద్భుత చికిత్స!

విజయవాడ అర్బన్ ప్రతినిధి : కారణం లేకుండా, సంతోషం లేకున్నా ఆపుకోలేనంతగా నవ్వడం వినడానికి వింతగా ఉన్నా, ఇదొక అరుదైన వ్యాధి. దీనినే 'లాఫింగ్ ఎపిలెప్సీ' (+వశ్రీఖర్అష రావఅఓబతీవం) అంటారు. మెదడులోని 'హైపోథాలమస్' భాగంలో ఏర్పడే 'హైపోథాలమిక్ హమార్టోమా' అనే చిన్న గడ్డ వల్ల రోగులు నియంత్రణ లేకుండా నవ్వుతూ ఫిట్స్ బారిన పడుతుంటారు. ఇటీవల ఎయిమ్స్ (అూ××మీూ) జోధ్‌పూర్ వైద్యులు ఈ వ్యాధి చికిత్సలో అద్భుత విజయం సాధించారు. అత్యంత క్లిష్టమైన 'మినిమల్లీ ఇన్వేసివ్ సర్జరీ' ద్వారా మెదడులోని ఆ గడ్డను తొలగించి, రోగులకు ఈ సమస్య నుండి శాశ్వత పరిష్కారం అందించారు. అత్యాధునిక వైద్య సాంకేతికతతో ఈ అరుదైన సమస్యకు చికిత్స అందించడం వైద్య రంగంలో ఒక మైలురాయిగా నిలిచింది.

## అనకాపల్లి జిల్లాలో రోడ్డు ప్రమాదం.. ముగ్గురి మృతి



**ఎలమంచిలి ఏప్రిల్ 03( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** అనకాపల్లి జిల్లాలో రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ముగ్గురు యువకులు మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎలమంచిలి మండలం పోతిరెడ్డిపాలెం కూడలి వద్ద జాతీయ రహదారిపై బైక్‌ను ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. గురువారం అర్ధరాత్రి దాటిన ఈ ఘటన చోటుచేసుకుంది.మృతులను పురుషోత్త పురం గ్రామానికి చెందిన బంగా రు నాని (24), ఏటికొప్పాకకు చెందిన ఇల్లకు గోవిందు (25), పోతిరెడ్డిపాలేనికి చెందిన బంగారు దుర్గాప్రసాద్(16)గా గుర్తించారు. పెయింటర్లుగా ఉపాధి పొందుతున్న ఈ ముగ్గురూ.. పురుషోత్తపురంలోని అమ్మవారి జాతర చూసేందుకు రాత్రి 10 గంటల సమయంలో వెళ్లారు. తిరిగి వస్తూ దుర్గాప్రసాద్‌ను పోతిరెడ్డిపాలెంలో దించేందుకు బైక్‌పై వెళ్లారు. ఈ క్రమంలో గ్రామ కూడలి వద్ద వీరి బైక్‌ను విజయవాడ వైపు వెళ్తున్న బస్సు ఢీకొట్టింది. ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందగా.. మరొకరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయారు. ఎలమంచిలి సీఐ ధనుంజయరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## అమరావతి బిల్లుకు ఆమోదం..
## నందిగామ మున్సిపల్ కార్యాలయం వద్ద సంబరాలు...



**నందిగామ ఏప్రిల్ 03( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** అమరావతి చట్టబద్ధత బిల్లుకు ఉభయ సభల్లో ఆమోదం లభించిన సందర్భంగా నందిగామ పట్టణంలో సంబరాలు నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ కమిషనర్ లోవరాజు ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది కలిసి ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచుకుంటూ ఉత్సాహంగా సంబరాలు జరుపుకున్నారు. అమరావతి రాజధానిగా చట్టబద్ధత పొందడం రాష్ట్ర అభివృద్ధికి కీలక మైలురాయిగా పేర్కొన్నారు. ఈ నిర్ణయం ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తుందని అభిప్రాయపడ్డారు. రాజధాని నిర్మాణం వేగవంతం కావడంతో పాటు పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ లోవరాజు మాట్లాడుతూ, అమరావతి అభివృద్ధి రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే దిశగా కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం చారిత్రాత్మకమని, అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆనందాన్ని పంచుకున్నారు. పట్టణంలో పండుగ వాతావరణం నెలకొనగా, ప్రజలు కూడా ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తూ హర్షం వ్యక్తం చేశారు.

## సీసీ రహదారులను ప్రారంభించిన మంత్రి డోలా



**టంగుటూరు ఏప్రిల్ 03( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం శివపురం గ్రామంలో 15వ ఆర్థిక సంఘం, ఉపాధి హామీ పథకం నిధులు రూ.25 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రైనేజీలను గురువారం సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి పలువురు అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ రానున్న రెండేళ్లలో గ్రామంలోని ప్రతి వీధిలో సీసీ రోడ్డు, డ్రైనేజీలను పూర్తి చేస్తామన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తూ, ఒకటో తేదీన పింఛన్లను పంపిణీ చేస్తున్నానమన్నారు. సూపర్ సిక్స్ పథకంలోని ప్రతి హామీని నెరవేరుస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ జోసెఫ్ కుమార్, ఏఎంసీ ఛైర్మన్ రాచగర్ల వెంకట్రావు, తెలుగుదేశం పార్టీ నాయకులు బెల్లం జయంతి బాబు, బెజవాడ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్.అన్నవరం పంచాయతీ ప్రత్యేక అధికారిగా మరిడయ్య బాధ్యతలు స్వీకరించారు



**కాకినాడ ఏప్రిల్ 03( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** కాకినాడ జిల్లా తుని మండలం ఎస్.అన్నవరం పంచాయతీ ప్రత్యేక అధికారిగా జీ.మరిడయ్య శుక్రవారం నాడు బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర వ్యాప్తంగా సర్పంచుల పదవీకాలం పూర్తి అవ్వడంతో నేటి నుండి ప్రత్యేక అధికారుల పాలనలో పంచాయతీలు పనిచేస్తాయని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ సందర్భంగా ఆయన పంచాయతీ అభివృద్ధికి పాటు పడతానని తెలిపారు. ఆయనను సెక్రెటరీ శేషగిరిరావు, కూటమి నాయకులు ఆహ్వానించారు.

## శంకుస్థాపనలో పాల్గొన్న మంత్రి, ఎమ్మెల్యే



**కంకిపాడు ఏప్రిల్ 03( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** కోలవెన్ను గ్రామ శివారు మాదాసువారిపాలెంలో భక్త ప్రవర్త ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించే కళ్యాణ మండపానికి ఆలయ కమిటీ ప్రతినిధి కొప్పరాజు సురేష్ ఆధ్వర్యంలో శంకుస్థాపన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, ఎమ్మెల్యే బోడే ప్రసాద్ పాల్గొని భూమి పూజ చేసి శంకుస్థాపన చేశారు. అమరావతి శాశ్వత రాజధానిగా పార్లమెంటులో ఆమోదం పొందడం ఐదు కోట్ల ఆంధ్రులకు హర్షనీయమని ఈ సందర్భంగా తెలిపారు.

## పులివెందులలో ఉచిత కోచింగ్ అడ్మిషన్లు ప్రారంభం





**పులివెందుల ఏప్రిల్ 03( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** పులివెందుల పట్టణంలోని స్థానిక పాత సత్రంబడి పాఠశాలలో శుక్రవారం ఉచిత విద్య ఉపాధ్యాయ బృందం ఉచిత కోచింగ్ అడ్మిషన్లను ప్రారంభించింది. ఈ సందర్భంగా విద్యార్థుల పేర్లను స్వయంగా నమోదు చేసుకుని అడ్మిషన్లు ఇచ్చారు. ఈ ఏడాది 10వ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు, పాలీసెట్, ఏపీఆర్జేసీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## ఆత్రేయపురంలో బీజేపీ శిక్షణా అభియాన్ విజయవంతం



**కొత్తపేట ఏప్రిల్ 03( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ఆత్రేయపురంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో 'పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహా అభియాన్--2026' కార్యక్రమం శుక్రవారం విజయవంతంగా ముగిసింది. ఈ శిక్షణా కార్యక్రమంలో జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకులు పాల్గొని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. బీజేపీ చరిత్ర, సిద్ధాంతాలు, సంస్థాగత నిర్మాణం, పార్టీ కార్యపద్ధతి, కార్యవిస్తరణ వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ భాస్కరరావు, కో కన్వీనర్ రాంబాబు, రమేష్ వర్మ, ఉమ్మిడిశెట్టి, కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.

## గుంటిగంగలో గంగాభవాని అమ్మవారి తిరునాల మహోత్సవాలు



**తాళ్లూరు ఏప్రిల్ 03( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ప్రకాశం జిల్లా తాళ్లూరు మండలం గుంటిగంగలో శుక్రవారం ఉదయం గంగాభవాని అమ్మవారి తిరునాల మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. పెద్ద ఎత్తున పూజలు నిర్వహించి ఉత్సవాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా గంగాభవాని అమ్మవారిని విశేష అలంకరణలో ముస్తాబు చేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకుంటున్నారు.

## హీట్ పెంచేస్తున్న నభా.. శారీలోనూ ఇంత గ్లామరా?



టాలీవుడ్ ఇస్మార్ట్ బ్యూటీ నభా నటేష్ సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన ఫోటోలు ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. సాధారణంగా గ్లామర్ పాత్రలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే నభా, ఈసారి బ్లాక్ శారీలో చాలా క్లాసీగా కనిపిస్తున్నారు. "ఇన్ మై శారీ ఎరా" అంటూ ఆమె పెట్టిన క్యాప్షన్ చూస్తుంటే, తన స్టైల్ స్టేట్‌మెంట్‌ను మార్చుకోవాలని ఆమె గట్టిగా ప్రయత్నిస్తున్నట్లు అర్థమవుతోంది. డార్క్ కలర్ నెట్టెడ్ శారీలో నభా ఇస్తున్న స్టిల్స్ ఆమెలోని కొత్త యాంగిల్‌ను బయటపెట్టాయి. సినిమా ఇండస్ట్రీలో ఒక నటి తన ఇమేజ్‌ను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవడం చాలా ముఖ్యం. నభా నటేష్ కూడా అదే బాటలో నడుస్తున్నారు. ఈ ఫోటోషూట్ చూస్తుంటే ఆమె కేవలం గ్లామర్ షోకే పరిమితం కాకుండా, విభిన్నమైన పాత్రలకు కూడా తాను సరిపోతానని మేకర్స్‌కు సంకేతాలు ఇస్తున్నట్లు తెలుస్తోంది. అసలు విషయానికి వస్తే, నభా నటేష్ ఇప్పుడు తన కెరీర్‌ను చాలా పకడ్బందీగా ప్లాన్ చేసుకుంటున్నారు. ఒక ప్రమాదం కారణంగా కొంతకాలం సినిమాలకు దూరమైన ఆమె, ఇప్పుడు మళ్ళీ తన ఫామ్‌ను నిరూపించుకునేందుకు సిద్ధమయ్యారు. కేవలం కమర్షియల్ సినిమాలే కాకుండా, కంటెంట్ ఉన్న చిత్రాలపై ఆమె దృష్టి పెడుతున్నారు. తన ఇమేజ్‌కు సరిపోయేలా విభిన్నమైన కథలను ఎంచుకుంటూ బాక్సాఫీస్ దగ్గర మళ్ళీ సత్తా చాటాలని చూస్తున్నారు. ప్రస్తుతం ఆమె చేతిలో కొన్ని క్రేజీ ప్రాజెక్టులు ఉన్నాయి. అందులో ముఖ్యంగా నిఖిల్ హీరోగా రాబోతున్న 'స్వయంభూ' సినిమాపై మంచి అంచనాలు ఉన్నాయి. ఇది ఒక పీరియడ్ డ్రామా కావడంతో నభా పాత్ర చాలా కీలకంగా ఉండబోతోందని సమాచారం. ఇవే కాకుండా 'నాగబంధం' అనే మరో విభిన్నమైన కథాంశంతో వస్తున్న సినిమాలో కూడా ఆమె నటిస్తున్నారు. ఈ రెండు సినిమాలు నభా కెరీర్‌కు చాలా ముఖ్యమైనవి. మరి ఆ సినిమాలు ఎలాంటి ఫలితాన్ని అందుకుంటాయో చూడాలి.

## బిగ్ డే -- కంటెంట్లతో ఆకట్టుకునే ప్రయత్నం





టాలీవుడ్ మరో మంచి ఫ్రైడే కోసం ఎదురు చూస్తున్న టైంలో కంటెంట్ నమ్ముకున్న రెండు సినిమాలు ఇవాళ థియేటర్లలో అడుగు పెట్టాయి. ఆ నమ్మకంతోనే ముందు రోజు సాయంత్రం నుంచే ప్రీమియర్లు స్టార్ట్ చేశాయి. ప్రాథమికంగా వచ్చిన ఓవర్సీస్, తెలుగు రాష్ట్రాల రిపోర్ట్స్ చూస్తుంటే రెండు నిరాశపరచలేదనే కనిపిస్తోంది. ఆడియన్స్ ఇచ్చే తీర్పు ఎలా ఉండబోతోందో మధ్యానానికి క్లారిటీ వస్తుంది. స్పెషల్ షోలు దాదాపు అన్ని చోట్ల హౌస్ ఫుల్స్ కావడం విశేషం. ముందు బైకర్ విషయానికి వస్తే జనవరిలో నారి నారి నడుమ మురారితో హిట్టు కొట్టిన శర్వానంద్ ఈసారి ఎవరూ ఊహించని మేకోవర్ తో వచ్చాడు. బైక్ రేసింగ్ కాన్సెప్ట్ కావడంతో ఒంటిని కష్టపెట్టుకుని, బరువు తగ్గి చాలా డెడికేషన్ ఇచ్చాడు. ట్రైలర్ లోనే అవి బయటపడ్డాయి. రాజశేఖర్ మొదటిసారి హీరో తండ్రి పాత్రకు ఎస్ చెప్పడం అంచనాల పరంగా ప్లస్ అయ్యింది. రేసింగ్ కాన్సెప్ట్ తో పాటు ఫాదర్ సన్ ఎమోషన్ మెయిన్ హైలైట్స్ లో ఒకటిగా చెబుతున్నారు. నీహారిక కొణిదెల నిర్మాతగా వ్యవహరించిన రాకాసకు ప్రమోషన్లు పెద్ద ప్లస్ అయ్యాయి. రామ్ చరణ్ తో చేసిన పదకొండు నిమిషాల ఇంటర్వ్యూ బజ్ పెరగడానికి ఉపయోగపడింది. సంగీత్ శోభన్ టైమింగ్ మీద ఆడియన్స్ లో అంచనాలు ఉండటం, లేడీ డైరెక్టర్ మానస శర్మ ప్రమోట్ చేసుకున్న విధానం జనంలో సాఫ్ట్ కార్నర్ వచ్చేలా చేశాయి. విఎఫ్ఎక్స్, ట్విస్టులు, ఆర్టిస్టుల టైమింగ్ మీద ఫీడ్ బ్యాక్ అయితే పాజిటివ్ గా ఉంది. సోషల్ మీడియా సపోర్ట్ బానే ఉంది. ఇవాళ కనక రెండు సినిమాలు పాస్ అయితే బాక్సాఫిస్ కు మంచి ఊపు వస్తుంది. మార్చిలో దురంధర్ ది రివెంజ్ ఒక్కటే వసూళ్లు తేగా ఉస్తాద్ భగత్ సింగ్ నిరాశపరిచింది. సరైన ఫీడింగ్ లేక వేసవి వృధా అయిపోతోందని కలవపడుతున్న ట్రేడ్ వర్గాలకు రాకాస, బైకర్ సక్సెస్ కావడం చాలా అవసరం. సముతిరఖని తమిళ డబ్బింగ్ కార్మేని సెల్వం కూడా ఈ రోజే ఆడియన్స్ ముందుకు వచ్చింది కానీ టైటిల్, వీక్ ప్రమోషన్ల వల్ల జనాలను చేరలేకపోతోంది.




## లేడీ డైరెక్టర్ ట్రెండ్ సెట్ చేస్తుందా?



సినీ రంగంలో మహిళలు నటనలోకి పెద్ద సంఖ్యలోనే వస్తారు కానీ.. టెక్నికల్ సైడ్ వెళ్లే వాళ్లు తక్కువ. అందులోనూ దర్శకత్వం వైపు అడుగులు వేసే వాళ్లు మరీ తక్కువ. ఇన్నేళ్ల తెలుగు సినీ చరిత్రలో కాస్త పేరున్న లేడీ డైరెక్టర్ల లిస్టు తీస్తే అది డబుల్ డిజిట్‌కు కూడా వెళ్లదు. ఈ తరంలో చెప్పుకోదగ్గ మహిళా దర్శకురాలు అంటే నందిని రెడ్డి మాత్రమే. ఆమెలా ట్రెండీగా సినిమాలు తీస్తూ పేరు సంపాదించిన మహిళా దర్శకులు మరొకరు కనిపించరు. ఐతే ఇప్పుడు నందిని తరహాలో పురుష దర్శకులకు దీటుగా ట్రెండీ సినిమా తీయగల సత్తా ఉన్న దర్శకురాలిగా మానస శర్మ అనే కొత్తమ్మాయి ఆశలు రేకెత్తిస్తోంది. నిహారిక కొణిదెల ప్రొడక్షన్లో ఒక షార్ట్ ఫిలిం చేసి మెప్పించిన ఈ అమ్మాయి.. ఈ శుక్రవారం విడుదల కానున్న 'రాకాస'తో ఫీచర్ ఫిలిం దర్శకురాలిగా పరిచయం అవుతోంది. ఈ సినిమా ప్రోమోలు చాలా ఆసక్తికరంగా అనిపించాయి. ఇది ప్రేక్షకులను వినోదంలో ముంచెత్తే సినిమా అవుతుందనే అంచనాలున్నాయి. మ్యాడ్, మ్యాడ్ స్క్వేర్ చిత్రాలతో ఎంటర్టైన్మెంట్‌కు కేరాఫ్ అడ్రస్ అయిపోయాడు సంగీత్ శోభన్. మంచి కామెడీ టైమింగ్‌కు ఉన్న అతడితో హార్రర్ టచ్ ఉన్న ఫాంటసీ సినిమా చేయాలనుకోవడంతోనే మానస సగం విజయం సాధించింది. ప్రోమోల్లో కథాంశం, విజువల్స్, ఫన్ ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకున్నాయి. మానస నరేషన్ చాలా ట్రెండీగా అనిపించింది టీజర్, ట్రైలర్లలో. ఆమెను నమ్మి నిహారిక పెద్ద బడ్జెట్టే పెట్టినట్లు కనిపిస్తోంది. ఈ సినిమాకు అడ్వాన్స్ బుకింగ్స్ కూడా బాగున్నాయి. కావాల్సిందల్లా మంచి టాకే. ఈ రోజు రాత్రి ప్రిమియర్స్ నుంచి టాక్ వచ్చిందంటే 'రాకాస' మంచి విజయం సాధించబోతున్నట్లే. అదే జరిగితే తెలుగు సినిమాకు చాన్నాళ్ల తర్వాత ఓ ట్రెండీ లేడీ డైరెక్టర్ దొరికినట్లే. మానస లుక్స్.. 'ఓయ్' సినిమాలో షామిలిని తలపించేలా ఉండడంతో ఆమె ఆల్రెడీ సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది. ఇక కంటెంట్‌తోనూ మెప్పించిందంటే తన పేరు మార్మోగడం ఖాయం.

## అట్లీ రిస్క్ తీసుకోలేకపోతున్నారా?




ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పుట్టినరోజు వస్తుందంటే సోషల్ మీడియాలో రచ్చ మామూలుగా ఉండదు. ఏప్రిల్ 8వ తేదీ కోసం అభిమానులు చాలా కాలంగా వెయిట్ చేస్తున్నారు. ముఖ్యంగా అట్లీ దర్శకత్వంలో రాబోతున్న తన 22వ సినిమా ~ఞా22 నుంచి ఏదైనా ఒక అదిరిపోయే వీడియో అప్డేట్ వస్తుందని అందరూ ఆశించారు. అయితే ఇప్పుడు సీన్ మారింది. ఫ్యాన్స్ ఆశించిన గ్లింప్స్ లేదా టీజర్ ఈసారి రావడం లేదని తెలుస్తోంది. దీనికి బదులుగా కేవలం టైటిల్ అనౌన్స్‌మెంట్ పోస్టర్‌తోనే మేకర్స్ సరిపెట్టే అవకాశం ఉంది. సాధారణంగా ఇంత పెద్ద ప్రాజెక్టుల విషయంలో గ్లింప్స్ రాకపోవడం అనేది అభిమానులకు కొంత నిరాశ కలిగించే విషయమే. కానీ ఇక్కడ దర్శకుడు అట్లీ ఒక పక్కా ప్లాన్‌తోనే అడుగులు వేస్తున్నట్లు కనిపిస్తోంది. కేవలం పుట్టినరోజు కదా అని ఏదో ఒక వీడియోను హడావిడిగా వదలడం కంటే, క్వాలిటీ విషయంలో రాజీ పడకుండా ఉండటమే మేలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. అందుకే రిస్క్ తీసుకోకుండా కేవలం ఒక పవర్‌ఫుల్ పోస్టర్‌తోనే సినిమాపై ఉన్న క్రేజ్‌ను మెయింటైన్ చేయాలని టీమ్ డిసైడ్ అయ్యింది. అసలు విషయానికి వస్తే, ఈ అప్డేట్ ఆగిపోవడానికి ప్రధాన కారణం విజువల్ ఎఫెక్ట్స్ అని తెలుస్తోంది. ఇదొక సైన్స్ ఫిక్షన్ సినిమా కావడంతో గ్రాఫిక్స్ పనితనం చాలా కీలకం. ప్రస్తుతం అనుకున్న స్థాయిలో విజువల్ అవుట్‌పుట్ రాకపోవడంతో, అరకొర విజువల్స్‌తో టీజర్‌ను రిలీజ్ చేయడం కంటే దాన్ని పక్కన పెట్టడమే ఉత్తమమని మేకర్స్ నిర్ణయించుకున్నారు. ఏదో ఒక వీడియోను రిలీజ్ చేసి ఆ తర్వాత నెగిటివ్ బజ్ తెచ్చుకోవడం కంటే, పర్ఫెక్ట్ టైమ్ కోసం వెయిట్ చేయడం మంచి స్ట్రాటజీ అని చెప్పొచ్చు. ఇటీవలి కాలంలో పెద్ద సినిమాలకు సోషల్ మీడియాలో మొదట్లో చిన్న నెగిటివ్ టాక్ వచ్చినా అది సినిమా ఫలితంపై గట్టి ప్రభావం చూపుతోంది. ఒకసారి నెగిటివ్ ఇంప్రెషన్ పడితే దాన్ని మళ్ళీ పాజిటివ్ గా మార్చుకోవడానికి చిత్ర బృందం చాలా కష్టపడాల్సి వస్తోంది. అల్లు అర్జున్ కెరీర్‌లోనే ఇది అత్యంత భారీ బడ్జెట్ సినిమా కావడంతో, మొదటి అడుగులోనే ఎలాంటి తప్పులు జరగకూడదని అట్లీ చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. మంచి కంటెంట్ ఉన్నప్పుడు అది కొంచెం ఆలస్యంగా వచ్చినా ఆడియన్స్ రిసీవ్ చేసుకుంటారు. ఇక మేకర్స్ ఇవ్వబోయే అప్డేట్ ఎలా ఉంటుందో చూడాలి.



# బిజినెస్ న్యూస్



## రూపాయి తెచ్చిన లాభాలు



రూపాయిలో స్పెక్యులేటివ్ ట్రేడ్ నియంత్రణకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చర్యలు చేపట్టడంతో డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ గణనీయంగా పుంజుకుంది. గురువారం రూపాయి ట్రేడింగ్ డాలర్‌తో పోలిస్తే 94.62 వద్ద ఆరంభమైంది. ఆ తర్వాత 188 పైసలు పెరిగి 92.82 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని చేరింది. చివరకు 152 పైసల లాభంతో 93.18 వద్ద ముగిసింది. 2013 తర్వాత డాలర్‌తో పోలిస్తే, రూపాయి విలువకు అత్యధిక ఒక రోజు లాభం ఇదే. రూపాయి గణనీయంగా పుంజుకోవడం స్టాక్ మార్కెట్‌కు ఎనలేని సానుకూలత తెచ్చిపెట్టింది. భారీ నష్టాలతో ఆరంభమైన సెన్సెక్స్, రోజులో కనిష్ఠ స్థాయి నుంచి సుమారు 2,000 పాయింట్లు కోలుకుని, లాభాల్లో ముగిసింది. ఐటీ, బ్యాంకింగ్ షేర్లలో కొనుగోళ్లు ఇందుకు ఉపకరించాయి. బ్రెంట్ ముడి చమురు 7.67% పెరిగి 108.90 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లన్నీ నష్టాల్లో ముగియగా.. ఐరోపా మార్కెట్లు ప్రతికూల ధోరణిలోనే ఆరంభమయ్యాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 872 పాయింట్ల నష్టంతో 72,262.05 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 73,134.32) ఆరంభమైంది. ఆ తర్వాత నష్టం 1588 పాయింట్లకు చేరి, సూచీ 71,545.81 పాయింట్లకూ దిగివచ్చింది. అక్కడ నుంచి పుంజుకుంటూ వచ్చిన సూచీ.. చివరకు 185.24 పాయింట్ల లాభంతో 73,319.55 పాయింట్ల వద్ద ముగిసింది. ఇంట్రాడే గరిష్ఠమైన 73,568.54 ప్రకారం చూస్తే.. కనిష్ఠ స్థాయి నుంచి సూచీ 2,023 పాయింట్లు పుంజుకుంది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 33.70 పాయింట్లు పెరిగి 22,713.10 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 22,182.55 వద్ద కనిష్ఠాన్ని; 22,782.30 వద్ద గరిష్ఠాన్ని తాకింది. మూడు రోజులే ట్రేడింగ్ జరిగిన ఈ వారంలో మొత్తం మీద సెన్సెక్స్ 264 పాయింట్లు; నిఫ్టీ 107 పాయింట్లు నష్టపోయాయి. సెన్సెక్స్ 30 కంపెనీల షేర్లలో 11 మినహా మిగతావన్నీ లాభాల్లోనే ముగిశాయి. ఐటీ రంగానికి చెందిన హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ 3.47%, టెక్ మహీంద్రా 2.67%, ఇన్ఫోసిస్ 1.9%, టీసీఎస్ 1.8% అధికంగా లాభపడ్డాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 1.21%, బజాజ్ ఫైనాన్స్ 1.13% పెరిగాయి. ఏషియన్ పెయింట్స్ 2.46%, ఎటర్నల్ 2.13%, సన్‌ఫార్మా 1.96%, ఎన్‌టీపీసీ 1.33%, రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.31% తగ్గాయి. సాయి పేరెంటెరల్స్ షేరు, ఇష్యూ ధర రూ.392తో పోలిస్తే బీఎస్ఈలో 3.32% అధికంగా రూ.405 వద్ద ఈ షేరు నమోదైంది. చివరకు 3.67% లాభంతో రూ.406.40 వద్ద ముగిసింది. వ్యాపార లక్ష్యాలపై పూర్తిస్థాయిలో దృష్టి సారిస్తూ, నియంత్రణ నిబంధనలను కచ్చితంగా పాటిస్తామని, కార్యకలాపాల్లో పారదర్శకత అవలంబిస్తామని సంస్థ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె. అనిల్‌కుమార్ తెలిపారు. హెచ్‌బీఎల్ ఇంజినీరింగ్‌కు వారణాసిలోని బనారస్ లోకోమోటివ్ వర్క్స్ నుంచి రూ.179.79 కోట్ల కాంట్రాక్టు లభించింది. రైలు ఇంజిన్లలో అమర్చే అత్యంత ఆధునిక కవచ్ 4.0 ఆన్‌బోర్డు పరికరాల సరఫరా, పరీక్షలు లాంటి బాధ్యతలను హెచ్‌బీఎల్ చేపట్టనుంది. టెలికాం, పర్యావరణ రంగాల నుంచి రూ.42.50 కోట్ల విలువైన పనులను బొండాడ ఇంజినీరింగ్ దక్కించుకుంది. తెలంగాణ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ నుంచి కమ్యూనికేషన్ టవర్లు, పరికరాల గదుల సరఫరాకు ఆర్డర్ లభించింది.


## మహీంద్రా వాహనాల ధరల పెంపు



ముంబయి: ఈనెల 6 నుంచి విద్యుదేతర ఎస్‌యూవీలు, వాణిజ్య వాహనాల ధరలను 2.5% వరకు పెంచనున్నట్లు మహీంద్రా అండ్ మహీంద్రా గురువారం ప్రకటించింది. సంప్రదాయ ఇంధన ఇంజిన్ల (ఐసీఈ)తో నడిచే ఎస్‌యూవీలు, వాణిజ్య వాహనాల సగటు ధరలు 1.6% పెరుగుతాయని కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. మోడల్, వేరియంట్‌ను బట్టి ధరల పెంపు వేర్వేరుగా ఉంటుందని పేర్కొంది. కంపెనీ ఇటీవల ఆవిష్కరించిన ఎక్స్‌యూవీ7ఎక్స్‌ఓ వాహనం ధర తొలి 40,000 మంది కొనుగోలుదార్లకు మాత్రం పెరగదని, ఇతరులకు పెంపు వర్తిస్తుందని వివరించింది. విద్యుత్తు మోటార్‌సైకిల్ రోడ్‌స్టర్ 9.1 కేడబ్ల్యూహెచ్ ధరను రూ.60,000 తగ్గిస్తున్నట్లు ఓలా ఎలక్ట్రిక్ ప్రకటించింది. సంస్థ సొంతంగా అభివృద్ధి చేసి, ఉత్పత్తి చేస్తున్న 4680 బ్యాటరీసెల్ ధరకు అనుగుణంగా ఈ బైక్ ధరను తగ్గిస్తున్నట్లు వివరించింది. గిగాఫ్యాక్టరీలో సెల్ ఉత్పత్తి పెరిగే కొద్దీ, వ్యయాలు తగ్గుతున్నాయని, ఈ ప్రయోజనాన్ని కొనుగోలుదార్లకు బదిలీ చేస్తున్నట్లు ఓలా ఎలక్ట్రిక్ వెల్లడించింది. ఇప్పటివరకు ఈ బైక్ ధర రూ.1,89,999 కాగా, ఇకపై రూ.1,29,999 అవుతుంది. కొన్ని ఛానళ్ల ద్వారా, పరిమిత సంఖ్యలో వాహనాలే ఈ ధరకు లభిస్తాయని సంస్థ పేర్కొంది. ఏప్రిల్ 3న సాయంత్రం 6:00 - 9:00 గంటల మధ్య సంస్థ వెబ్‌సైట్‌లో ఈ బైక్‌ను బుక్ చేసుకోవచ్చు.



## ఫార్మాపై నూరు శాతం టారిఫ్.. భారత కంపెనీలపై ప్రభావమెంత?



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి టారిఫ్ వార్ ప్రకటించారు. విదేశాల నుంచి దిగుమతయ్యే పేటెంట్ పొందిన మందులపై నూరు శాతం పన్ను విధించారు. ఈ మేరకు ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై ఆయన సంతకం చేశారు. ఔషధాలు, ఔషధ ముడి పదార్థాల దిగుమతుల వల్ల జాతీయ భద్రతకు ముప్పు వాటిల్లుతోందని, అందుకే సుంకాలు విధిస్తున్నట్లు పేర్కొన్నారు. ఫార్మాపై సుంకాలకు వైట్‌హౌస్ సిద్ధమవుతోందన్న వార్తల నేపథ్యంలో గురువారం దేశీయ ఫార్మా స్టాక్స్ అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొన్నాయి. ఇంతకీ టారిఫ్‌ల ప్రభావం భారతీయ కంపెనీలపై ఏ మేర ఉంటుంది? 'మోస్ట్ ఫేవర్డ్' కింద ఒప్పందాలు చేసుకున్న ఫార్మా కంపెనీలు అమెరికాలో ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటుచేస్తే.. వాటి పేటెంట్, ఇతర ఉత్పత్తులకు ఎలాంటి సుంకాలూ ఉండవు. అమెరికా ప్రభుత్వంతో ఒప్పందం చేసుకోని కంపెనీల పేటెంట్ మందులపై 100% వరకు దిగుమతి సుంకం విధిస్తారు. ధరల ఒప్పందం కుదుర్చుకోకుండా ఒకవేళ ఫ్యాక్టరీ నిర్మిస్తున్నట్లయితే ప్రస్తుతం 20% పన్ను ఉంటుంది. అది నాలుగేళ్లలో 100%కి పెరుగుతుంది. ప్రస్తుతానికి జనరిక్, బయోసిమిలర్, అత్యవసర మందులకు ఈ పన్ను నుంచి మినహాయింపు ఇచ్చారు. దేశీయ కంపెనీలు అత్యధికంగా జనరిక్ మందులను అమెరికాకుకు ఎగుమతి చేస్తుంటాయి. ఈ మందులపై ప్రస్తుతం పన్ను లేదు కాబట్టి, భారత ఫార్మా రంగానికి టారిఫ్‌ల భారం ప్రస్తుతానికి లేనట్లే. భవిష్యత్తులో జనరిక్ మందులను కూడా సమీక్షిస్తామని వైట్‌హౌస్ పేర్కొంది. ఒకవేళ జనరిక్ మందులపై పన్నులు విధిస్తే, భారత కంపెనీలకు భారీ నష్టం వాటిల్లే అవకాశం ఉంది. అయితే, డాక్టర్ రెడ్డీస్, సన్‌ఫార్మా, బయోకాన్ వంటి కంపెనీలు జనరిక్ మందులతో పాటు పేటెంట్ మందులు కూడా అమెరికాలో విక్రయిస్తున్నాయి. కాబట్టి ఆయా కంపెనీలపై పన్నుల భారం పడే అవకాశం ఉంటుంది. టారిఫ్‌లపై చర్చలు జరిపేందుకు పెద్ద కంపెనీలకు 120 రోజులు, మిగతా సంస్థలకు 180 రోజుల సమయమిచ్చింది.

# 'ఎల్‌నినో'తో తక్కువ వర్షాలు



**విజయనగరం, ఏప్రిల్ 03 (నేటి మనదేశమ్)** : ఎల్‌నినో ఏర్పడే పరిస్థితులు ఉన్నా యని, దాని ప్రభావంతో జిల్లాలో తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని కలెక్టర్ ఎస్.రాంసుందర్‌రెడ్డి తెలి పారు. ఎపి సామూహిక ప్రకృతి వ్యవసాయం, ఎపి రైతు సాధికారిక సంస్థల ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన మూడు రోజుల జిల్లా స్థాయి శిక్షణను గురువారం కలెక్టర్ ప్రారం భించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు వర్షాభావ పరిస్థితులను తట్టుకొనే, రసాయన ఎరువులు లేని, తక్కువ పెట్టుబడి గల ప్రకృతి వ్యవసాయ విధానాలను రైతులు అవలంబించాలని కోరారు. ప్రకృతి వ్యవసాయంపై నిర్వహిస్తున్న ఈ శిక్షణ కార్యక్రమాలను త్వరగా పూర్తిచేసి ఖరీఫ్‌కు ముందే రైతుల వద్దకు చేర్చాలని తెలిపారు. జిల్లాలో నూరు శాతం రైతులు ప్రకృతి వ్యవసాయానికి మారేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, వారిని ప్రోత్సహించాలని సూచించారు. రసా యన ఎరువుల వాడకంతో నిస్సారమైన భూమి, ప్రకృతి వ్యవ సాయం ద్వారా సారవంతం అవుతుందని, ప్రజలకు ఆరోగ్య వంతమైన ఆహారం అందుబాటులోకి వస్తుందని తెలిపారు.

కార్యక్రమంలో...

జిల్లా వ్యవసాయ అధికారి రామారావు, ఎపి సిఎన్‌ఆర్‌ఎఫ్ సంస్థ డిపిఎం ఆనందరావు, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు, మండల వ్యవసాయ అధికారు లు, ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ, రైతు సాధికారిక సంస్థ అధికారులు, ప్రకృతి వ్యవసాయ రైతులు పాల్గొన్నారు.

# నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలి



**పార్వతీపురం, ఏప్రిల్ 03 (నేటి మనదేశమ్)** : కార్మికులకు నష్టం చేకూర్చే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ డిమాండ్ చేసింది. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి పాత బస్టాండ్ వరకు కార్మికులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం వద్ద వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ అధ్యక్ష కార్యదర్శులు సిహెచ్.సింహా చలం, ఎం.శంక ర్రావు, సిఐటియు నాయకులు బి.సూరిబాబు మాట్లాడుతూ, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని 36 కోట్ల మంది కార్మిక వర్గం ఫిబ్రవరి 12న దేశవ్యాప్త సమ్మె చేసినప్పటికీ నాలుగు లేబర్ కోడ్లను ఏప్రిల్ 1నుంచి అమలు చేయాలని బిజెపి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ఈ లేబర్ కోడ్లకు నిరసనగా రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎం.శివ, పి.వరదరాజు, బి.రవి, గుంపస్వామి, ఆనంద్, గంగరాజు, సుజాత, ఇప్పలమ్మ, పాపలమ్మ, లక్ష్మి తది తరులు పాల్గొన్నారు.కొమరాడ : కేంద్ర ప్రభు త్వం నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలని సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. బ్లాక్ డే సందర్భంగా కార్మికు లతో కలిసి మండల కేంద్రంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లేబర్ కోడ్లకు నిరసనగా రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేయాలని, ఆ దిశగా భవిష్యత్తులో జరిగే పోరాటాలకు కార్మికులు, రైతులు, కూలీలు, దళితులు, గిరిజ నులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు. వీరఘట్టం : లేబర్ కోడులను రద్దు చేయాలని గురువారం స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయం ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో పంచాయతీ వర్కర్లు నిరసన చేపట్టారు.

# సీసీ రహదారులను ప్రారంభించిన మంత్రి డోలా



**టంగుటూరు, ఏప్రిల్ 03 (నేటి మనదేశమ్)** : ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం శివపురం గ్రామంలో 15వ ఆర్థిక సంఘం, ఉపాధి హామీ పథకం నిధులు రూ.25 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రైనేజీలను గురువారం సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి పలు వురు అధికారులతో కలిసి ప్రారం భించారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ రానున్న రెండేళ్లలో గ్రామంలోని ప్రతి వీధిలో సీసీ రోడ్లు, డ్రైనేజీలను పూర్తి చేస్తామన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తూ, ఒకటో తేదీన పింఛన్లను పంపిణీ చేస్తున్నా మన్నారు. సూపర్ సిక్స్ పథకంలోని ప్రతి హామీని నెరవేరుస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తు న్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ జోసెఫ్ కుమార్, ఏఎంసీ ఛైర్మన్ రాచగర్ల వెంక ట్రావు, తెలుగుదేశం పార్టీ నాయకులు బెల్లం జయంతి బాబు, బెజవాడ వెంకటేశ్వర్లు, తహ సీల్దార్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## అన్న క్యాంటీన్‌ను పరిశీలించిన పుర కమిషనర్ నయీం మహమ్మద్



**అధోని, ఏప్రిల్ 03 (నేటి మనదేశమ్)** : ఆదోని పట్టణంలోని అంబేద్కర్ కూడలిలో ఉన్న అన్న క్యాంటీన్‌ను గురువారం ఉదయం పురపాలక సంఘం కమిషనర్ నయీం మహమ్మద్ పరిశీలించారు. అల్పాహారం గురించి అడిగి తెలుసుకున్నారు. క్యాంటీన్‌కు వచ్చిన వారితో మాట్లాడారు. క్యాంటీన్‌లో సమస్యలు సృష్టించిన, సిబ్బంది ప్రవర్తన తీరు ఇబ్బందికరంగా ఉంటే క్యాంటీన్‌లో క్యూఆర్ కోడ్ స్కానర్ ద్వారా నేరుగా ఫిర్యాదు చేయవచ్చని కమిషనర్ తెలిపారు. పరిశుభ్రతను పాటించి, శుద్ధి నీటిని అందించాలని సిబ్బందిని కోరారు.

# సైబర్ మోసాల పట్ల అప్రమత్తం : ఎస్‌పి




**చీపురుపల్లి, ఏప్రిల్ 03 (నేటి మనదేశమ్)** :సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌పి ఎఆర్ దామోదర్ అన్నారు. చీపురుపల్లి సర్కిల్ కార్యాలయంలో నూతనంగా నిర్మించిన సర్కిల్ భవనాన్ని చీపురుపల్లి డిఎస్‌పి ఎస్ రాఘువులతో కలిసి ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ జిల్లాలో ప్రత్యేకించి విశ్రాంత ఉద్యోగులు సైబర్ మోసాలకు ఎక్కువ శాతం గురవుతున్నారన్నారు. ఫోన్ కాల్స్ ద్వారా అరెస్టు చేస్తామంటూ భయపెట్టిన వారిని నమ్మకుండా అవసరమైతే 1974 నెంబర్‌కు గాని డయల్ 100కు గాని ఫోన్ చేసి పోలీసులు సహకారం తీసుకోవాలన్నారు. వాహనాలు నడిపే సమయంలో తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకొని హెల్మెట్లు ధరించాలన్నారు. హెల్మెట్లు ధరించిన కారణంగా సుమారు జిల్లాలో 200 మంది మృత్యువాత పడ్డారని తెలిపారు.

## చోడి, మొక్కజొన్న పంటలపై అవగాహన



**పద్మనాభం, ఏప్రిల్ 03 (నేటి మనదేశమ్)** : మండలంలోని కృష్ణాపురం గ్రామంలో ఆత్మ పథకంలో భాగంగా రైతులకు చోడి మొక్కజొన్న పంటలపై సస్యరక్షణ చర్యలను భీమిలి సహాయ వ్యవసాయ సంచాలకులు బొడ్డేపల్లి విజయకుమార్ గురువారం వివరించారు. చోడి కొనుగోలు కేంద్రం త్వరలోనే ప్రారంభిస్తామని చెప్పారు. ఏప్రిల్ రెండో వారంలో నువ్వులు 100 శాతా రాయితీ మీద సరఫరా చేస్తామన్నారు. ప్రతి రైతూ రైతు రిజిస్ట్రేషన్ తప్పకుండా చేసుకోవాలని చెప్పారు. చోడి పంటలో వచ్చే తెగుళు ,, వాటి నివారణ, మొక్కజొన్న పంటలో ఎరువులు వినియోగం గురించి కృషి విజ్ఞాన కేంద్రం కొండంపూడి శాస్త్రవేత్త రాజ్‌కుమార్ విపులంగా వివరించారు. కార్యక్రమంలో పద్మనాభం సొసైటీ ప్రెసిడెంట్ ఎం.అప్పలనాయుడు, బ్లాక్ టెక్నాలజీ మేనేజర్ డాక్టర్ జ్యోతిర్మయి, వ్యవసాయ సహాయకులు దిలీప్ గౌస్, రైతులు పాల్గొన్నారు.

## 'జ్యోతిర్గమయ'తో ట్రాన్స్‌జెండర్లకు ఉపాధి




**మధురవాడ, ఏప్రిల్ 03 (నేటి మనదేశమ్)** : జ్యోతిర్గమయ కార్యక్రమం ద్వారా సమాజంలో జీవిస్తున్న ట్రాన్స్ జెండర్లకు ఉపాధి కల్పిస్తు న్నట్లు విశాఖ పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. ఎండాడ మహిళా పోలీస్ స్టేషన్ వద్ద అవకాశాలు లేని ట్రాన్స్ జెండర్లకు గురువారం జ్యోతిర్గమయ కార్య క్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు కమిషనర్ మాట్లాడుతూ, ట్రాన్స్‌జెం డర్లు సిగల్ పాయింట్‌లు, షాప్‌ల వద్ద భిక్షాటన చేయడం, కొన్ని సందర్భాలలో సామాన్యులపై దౌర్జన్యాలకు పాల్పడటంపై ఫిర్యాదులొచ్చాయని తెలిపారు. దీనిపై ట్రాన్స్ జెండర్లు, వారి గురువు లతో పలుమార్లు సమావేశాలు నిర్వహించి, సమస్యలను తెలుసుకొని, వారికి సమాజంలో గుర్తింపు కలిగే జీవనం కలిగిం చేందుకు జ్యోతిర్గమయ కార్యక్రమం ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ట్రాన్స్‌జెండర్ల వివరా లను సేకరించి వారి విద్యార్హతలను ఉద్యోగ అవకాశాలు, వ్యాపార రుణాలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. 20 మందికి జివిఎంసిలో ఉపాధి జివిఎంసిలో 20 మంది ట్రాన్స్‌జెండర్లకు ఉపాధి కల్పించినట్లు పోలీసు కమిషనర్ తెలిపారు. మరో ఆరుగురికి స్వయం ఉపాధిలో భాగంగా పాన్?, కిరణాషాప్‌ల ఏర్పాటుకు బ్యాంకుల నుంచి రుణాలు కల్పించినట్లు వివరించారు.

# లేగదూడల సంరక్షణే లక్ష్యం



**మేదరమెట్ల, ఏప్రిల్ 03 (నేటి మనదేశమ్)** : లేగదూడల సంరక్షణే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు జిల్లా పశుగణాభివృద్ధి శాఖ ఈవో మురళీకృష్ణ అన్నారు. కొరిశపాడు మండలం తమ్మవరం గ్రామంలో గురువారం ఏర్పాటు చేసిన లేగ దూడల ప్రదర్శన కార్య క్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో దూడల మరణాల శాతం తగ్గించేందుకు కృషి చేస్తు న్నట్లు తెలిపారు. దూడలకు వస్తున్న వ్యాధులు.. వాటికి అందించే చికిత్సల గురించి వివ రించారు. పాడి రైతులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. లేగ దూడల ప్రదర్శన నిర్వహించి విజేతలకు బహుమతులు అందిం చారు. ఈ కార్యక్రమంలో...

అద్దంకి పశుసంవర్థక శాఖ ఏడీ బ్రహ్మయ్య, వైద్యులు సైదయ్య, రాంబాబు, ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాసరావు, తెదేపా నాయకులు కరిచేటి రాం బాబు, శ్రీనివాస్, పాడి రైతులు పాల్గొన్నారు.

# పిఆర్‌ఎస్ కమ్యూనిటీ హాల్ ప్రారంభం



**పూసపాటిరేగ, ఏప్రిల్ 03 (నేటి మనదేశమ్)** : మండలంలోని కుమిలి గ్రామంలో అత్యాధునిక వసతులతో నూతనంగా నిర్మించిన పిఆర్‌ఎస్ కమ్యూనిటీ హాల్‌ను రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్, నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగ మాధవి, ఎపి మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు గురువారం ఘనంగా ప్రారంభించారు. ఈ కమ్యూనిటీ హాల్‌ను ఎస్‌ఎంఎస్ ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ రమేష్‌బాబు పొట్లూరి ఆర్థిక సహకారంతో, కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్‌ఆర్) కార్యక్రమాల్లో భాగంగా నిర్మించారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ కుమిలి గ్రామం, పరిసర ప్రాంతాల ప్రజల సామాజిక అవసరాలను తీర్చడంలో ఈ కమ్యూనిటీ హాల్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. గ్రామ ప్రజల అవసరాన్ని గుర్తించి, అత్యాధునిక సదుపాయాలతో ఈ భవనాన్ని నిర్మించి అందించిన ఎస్‌ఎంఎస్ ఫార్మాస్యూటికల్స్ యాజమాన్యానికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఎమ్మెల్యే లోకం నాగ మాధవి, మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు మాట్లాడుతూ గ్రామస్తుల సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలు, శుభకార్యాలకు ఈ భవనం ఎంతో ఉపయోగపడు తుందని, దీన్ని గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎస్‌ఎంఎస్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ రమేష్‌బాబు పొట్లూరి మాట్లాడుతూ సిఎస్‌ఆర్ కార్యక్రమాల్లో భాగంగా తమ సంస్థ విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఈ ప్రాంతంలో కమ్యూనిటీ హాల్ అవసరం ఉందని గ్రామ పెద్దలు కోరడంతో రూ.1.60 కోట్ల వ్యయంతో ఈ భవనాన్ని నిర్మించామని చెప్పారు. కొప్పెర్ల గురుకుల పాఠశాలలో రూ.1.20 కోట్లతో అభివృద్ధి పనులు, పూసపాటిరేగ హైస్కూల్‌లో రూ.1.8 కోట్లతో అదనపు గదుల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. పతివాడ, గుంపాం గ్రామాల్లో కూడా అభివృద్ధి పనుల ప్రతిపాదనలు ఉన్నాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర నాయకులు మహంతి చిన్నమనాయుడు, మహంతి శంకర్రావు, దల్లి ముత్యాలరెడ్డి, కోట్ల రఘు, పతివాడ శ్రీను, బాల అప్పలరాజు, మండల స్థాయి అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, కుమిలి గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో చేరాలని
## ఇంటింటా ప్రచారం



**ఆనందపురం, ఏప్రిల్ 03 (నేటి మన దేశమ్)** : రానున్న విద్యా సంవత్సరంలో విద్యా ర్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించే లక్ష్యంతో ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు గురువారం దుక్కవానిపాలెం, మెట్టమీద పాలెం, పెద్దిపాలెం పంచాయతీలో ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు కరపత్రాలు పంపిణీచేస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులో ఉన్న సౌక ర్యాలను వివరిం చారు. ప్రభుత్వం అందిస్తున్న విద్యా అవకాశా లను పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఉపాధ్యాయులు సూచించారు. పాఠశాలలో విశాలమైన ఆట స్థలం, ప్రత్యేక వ్యాయామ ఉపాధ్యాయులతో క్రీడా శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ముత్యాల నాయుడు వ్యాయామ ఉపాధ్యాయులు నరసింహామూర్తి తదితరులు ఉన్నారు.

## మాన్యులకు ఒక న్యాయం సామాన్యులకు మరొక న్యాయమా?



**మచిలీపట్నం ఏప్రిల్ 03 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** నూతనంగా నిర్మిస్తున్న భవనాన్ని అక్రమంగా కూల్చివేశారని చదలవాడ వీరేంద్ర, శ్రీపతి భానుమూర్తి శుక్రవారం కొబ్బరి తోట నందు నిర్వహించిన విలేకరుల సమావేశం లో తమ ఆవేదన వ్యక్తం చేశారు . ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో వీరేంద్ర మాట్లాడుతూ నగరపాలక సంస్థ అధికారులు నూతనంగా నిర్మిస్తున్న భవనమును ఎందుకు కూల్చివేశారో అర్థం కావటం లేదన్నారు. ప్లాన్ అప్రూవల్ ఇవ్వడానికి అధికారులు, కొబ్బరి తోట లో ఒక తెలుగుదేశం పార్టీ నాయకుని ఆదేశాల మేరకు అనుమతులు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని అన్నారు. నగరంలో అనుమతులు లేని నిర్మాణాలు అనేకం ఉన్నాయని వాటిని ఈ విధంగానే కూల్చివేస్తారా అంటూ ప్రశ్నించారు. స్థానిక మంత్రి కొల్లు రవీంద్ర ఏ అనుమతి తీసుకొని బెల్లం కొట్టు సందులో కమర్షియల్ బహుళ అంతస్తులు నిర్మాణాలు చేపట్టారు? వాటిని కూల్చివేసే ధైర్యం అధికారులకు ఉందా? అని అన్నారు. మేము సామాన్యులం కాబట్టే మాపై ఈ చిన్న చూపు అని అధికారులను విమర్శించారు. మాన్యులకు ఒక న్యాయం సామాన్యులకు మరొక న్యాయమా? అన్నారు. పొలిటికల్ వ్యవస్థ పై తమకు నమ్మకం లేదని న్యాయస్థానంపై పూర్తి నమ్మకం ఉందని తమకు జరిగిన అన్యాయాన్ని న్యాయస్థానంలో తేల్చుకుంటామని అన్నారు. తమ దగ్గర ఉన్న డాక్యుమెంట్లను మీడియా ముందు చూపించారు. వాటినే కోర్టులో సాక్షాదారులుగా ప్రొడ్యూస్ చేస్తామన్నారు.

## వీధి కుక్కల సమస్యల నియంత్రణపై వార్డ్ స్థాయి సమావేశం




**విజయవాడ , ఏప్రిల్ 03 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ 'డా' హరీష్, వార్డ్ లెవెల్ కమిటీ సభ్యులతో శుక్రవారం సమావేశం జరిగింది. శానిటరీ ఇన్స్పెక్టర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో, వార్డ్ కమిటీలు వీధి కుక్కల సమస్యలను పరిష్కరించాలని సూచించారు. వేసవి దృష్ట్యా డాగ్ జోన్లలో తాగునీటిని ఏర్పాటు చేయాలని, ప్రజలు, కమిటీ సభ్యులు కలిసి పనిచేస్తే వీధి కుక్కల సమస్యలను నియంత్రించవచ్చని తెలిపారు.

## గ్రామ రెవెన్యూ ప్రొఫైల్ తయారు చేయండి కలెక్టర్



**రేపల్లె ఏప్రిల్ 03 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ శుక్రవారం భట్టిప్రోలు మండలం గోరిగపూడి గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా, గోరిగపూడి రెవిన్యూ గ్రామానికి సంబంధించిన సమగ్ర ప్రొఫైల్ను తయారు చేయాలని విఆర్ఓను ఆదేశించారు. ఈ ప్రొఫైల్లో మొత్తం భూమి, ప్రభుత్వ భూమి, బరియల గ్రౌండ్, దేవాలయాలకు కేటాయించిన భూమి వంటి పూర్తి వివరాలు మ్యాప్ చేయబడాలని, తద్వారా భూమి వినియోగంపై స్పష్టత వస్తుందని కలెక్టర్ తెలిపారు.

## రావిపాడులో పేకాటరాయుళ్లపై పోలీసుల మెరుపుదాడి

**నరసరావుపేట ఏప్రిల్ 03 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :**



నరసరావుపేట రూరల్ పరిధిలోని రావిపాడు గ్రీన్ ఫీల్డ్ ఇండివిడ్యువల్ హోమ్స్లో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు రూరల్ SI శ్రీకాంత్ ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం ఆకస్మిక దాడి నిర్వహించారు. ఈ దాడిలో 8 మంది పేకాట ఆటగాళ్లను అదుపులోకి తీసుకుని, వారి వద్ద ఉన్న రూ.15,000 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ాx శ్రీకాంత్ తెలిపారు.

# ప్లాస్టిక్ రహిత నగర నిర్మాణానికి శ్రీకారం

## జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ




**మచిలీపట్నం ఏప్రిల్ 03 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** మచిలీపట్నం నగరాన్ని ప్లాస్టిక్ వ్యర్థాల రహితంగా, శుభ్రంగా, పచ్చదనంతో నింపిన ఆదర్శ నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రజలు తమ వంతు సహకారాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ను స్వర్ణాంధ్రప్రదేశ్గా తీర్చిదిద్దే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో భాగంగా మచిలీపట్నం నగరాన్ని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దేందుకు జిల్లా కలెక్టర్ శుక్రవారం వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుట్టారు. నగరంలోని రహదారులు భవనాలు శాఖ అతిథి గృహం సమీపంలోని ఎన్జీఓస్ కాలనీలో జరిగిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ స్వయంగా పాల్గొని, 'స్వచ్ఛాయుధం' అనే సాధనం ద్వారా ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల భాగస్వామ్యంతోనే పరిశుభ్రమైన, పచ్చదనంతో నిండిన నగరాన్ని నిర్మించగలమని అన్నారు. మచిలీపట్నం నగరాన్ని ప్లాస్టిక్ వ్యర్థాల రహితంగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ వ్యర్థాలను సులభంగా ఏరేందుకు ప్రత్యేకంగా రూపొందించిన ఒక సాధనాన్ని పరిచయం చేశారు. కింద భాగంలో చిన్న మేకు అమర్చిన కర్రను స్వచ్ఛాయుధంగా పిలుస్తున్నట్లు తెలిపారు. దీని ద్వారా రోడ్లు, వీధులు, ప్రజా ప్రదేశాల్లో పడేసిన ప్లాస్టిక్ వ్యర్థాలను సులభంగా సేకరించవచ్చని పేర్కొన్నారు. అలాగే, తమ ప్రాంతంలో ప్రతిరోజూ 15 నుంచి 30 నిమిషాల పాటు ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చే వారిని 'స్వచ్ఛ యోధులు'గా గుర్తించనున్నట్లు తెలిపారు. సమాజం కోసం సేవా దృక్పథంతో ముందుకు వచ్చే యువత, మహిళలు, స్వచ్ఛంద సంస్థలు, సామాజిక సేవకులు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం నగరంలో ప్లాస్టిక్ లిట్టరింగ్ను తగ్గించడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, అలాగే మున్సిపల్ సిబ్బంది డ్రైన్ క్లీనింగ్, కమర్షియల్ శానిటేషన్ వంటి ఇతర కీలక పనులపై మరింత సమయం కేటాయించేలా చేయడం అని జిల్లా కలెక్టర్ వివరించారు. ప్రజల సహకారంతో నగరాన్ని అందరూ గర్వించేలా క్లీన్ అండ్ గ్రీన్ సిటీగా తీర్చిదిద్దవచ్చని ఆయన అన్నారు. "మన నగరం -- మన బాధ్యత" అనే భావనతో ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆసక్తి గల వారు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ పేర్లను నమోదు చేసుకుని 'స్వచ్ఛ యోధులు'గా సేవలు అందించాలని ఈ సందర్భంగా కోరారు. కార్యక్రమంలో నగర కమిషనర్ బాపిరాజు, సహాయ కమిషనర్ గోపాలరావు, ఎన్నారై డాక్టర్ గార్నెపూడిరాజేంద్ర, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ రాష్ట్ర కన్వీనర్ పి శ్రీరామ్, వెహికల్ డిపో ఇంచార్జ్ కళా కేశవ,మున్సిపల్ సిబ్బంది, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## అగ్నికి ఆహుతైన గడ్డి.. రూ.2 లక్షల మేర నష్టం



**శిరివెళ్ల ఏప్రిల్ 03 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** గ్రామంలోని ఎస్సీ కాలనీలో నివాసం ఉంటున్న రైతు పల్లె రాజుకు చెందిన ఇంటి ఆవరణలో ఉన్న గడ్డి ప్రమాదవశాత్తు నిప్పంటుకొని శుక్రవారం అగ్నికి అహుతైంది. రాజు ఇంటి ఆవరణలో చెలరేగిన మంటలు.. క్రమంగా చుట్టుపక్కల ఇళ్లకు వ్యాపించడాన్ని గుర్తించిన స్థానికులు వాటిని ఆర్పివేశారు. ఆ ప్రాంతంలో ఉన్న గేదెలు, ఎద్దులు, ఆవులను పక్కకు తీసుకువెళ్లడంతో తృటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాయి. నిమిషాల వ్యవధిలో గడ్డి అగ్నికి ఆహుతి కావడంతో సుమారు రూ. 2 లక్షల మేర నష్టపోయినట్లు బాధిత రైతు కన్నీటి పర్యంతమయ్యాడు. ప్రభుత్వం స్పందించి తమకు పరిహారం అందేలా చూడాలని కోరాడు.

## జొన్నవాడ క్షేత్రంలో భక్తులకు చల్లని కబురు



**నెల్లూరు ఏప్రిల్ 03 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** జొన్నవాడలోని శ్రీ మల్లికార్జున స్వామి సమేత కామాక్షితాయి దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం దేవస్థానం కమిటీ కీలక నిర్ణయం తీసుకుంది. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని, భక్తుల దాహార్తిని తీర్చేందుకు ఉచిత మజ్జిగ, మినరల్ వాటర్ పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం నుండి ప్రారంభించారు. ఎండల తీవ్రత దృష్ట్యా భక్తులకు ఉపశమనం కలిగించడం కోసం ఈ ఏర్పాటు చేసినట్లు ఆలయ చైర్మన్ అశోక్ కుమార్, కార్యనిర్వహణాధికారి అర్వభూమి వెంకట శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. 'భక్తుల సేవే భగవంతుని సేవ' అని వారు పేర్కొన్నారు.

## పదవ తరగతిలోకి ప్రవేశించే విద్యార్థుల పట్ల అత్యంత శ్రద్ధ తీసుకోండి

### జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ.



**మచిలీపట్నం ఏప్రిల్ 03 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** జిల్లాలో 9వ తరగతి నుండి 10వ తరగతిలో ప్రవేశించిన విద్యార్థుల పట్ల ఇప్పటినుండే ప్రత్యేక శ్రద్ధ వహిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ విద్యాధికారులకు సూచించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ తన క్యాంపు కార్యాలయం నుండి జిల్లా విద్యాశాఖ అధికారి, మండల విద్యాధికారులు, మండల ప్రత్యేక అధికారులు, ఉన్నత పాఠశాలల ప్రత్యేక అధికారులతో విద్యార్థులకు చదువు నేర్పే విషయమై టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తాను ఇదివరకు 9 వ తరగతి నుండి పదవ తరగతికి చేరుకుంటున్న విద్యార్థులకు ప్రత్యేకించి ప్రేరణాత్మక సందేశాన్ని ఇచ్చామన్నారు. పాఠశాలల ప్రత్యేక అధికారులు ప్రధానోపాధ్యాయులతో కలిసి ఈనెల నాలుగో తేదీన గ్రామాల్లో పర్యటించి 10 లేదా 20 ఇళ్లు తిరిగి అక్కడ 9వ తరగతి నుండి 10వ తరగతిలో ప్రవేశించిన విద్యార్థులు ఉదయాన్నే 5 గంటలకు లేచి చదువుకుంటున్నారా లేదా విచారించాలని అవసరమైతే వారి తల్లిదండ్రులతో కూడా మాట్లాడి చదువుకునేలా పర్యవేక్షించాలని సూచించారు. ప్రతిరోజు ఆ విద్యార్థి ఉదయమే పాఠశాలలో జరిగే పాఠాన్ని ముందుగానే చదువుకొని పాఠశాలకు వెళ్లాలని ఆ తర్వాత ఇంటికి వచ్చాక అదే పాఠాన్ని మరల ఒకసారి చదువుకుంటే బాగా అర్థమవుతుందన్నారు. ఆ విధంగా విద్యార్థులు చదువుకుంటున్నారా? లేదా? విచారించాలన్నారు. ఒక నెల రోజుల పాటు విద్యార్థులు ఉదయమే లేచే అలవాటు చేసుకుంటే ఆ తర్వాత వారు అలానే చదువు కొనసాగిస్తూ ఫలితాలు బాగా వస్తాయన్నారు. ఆ విద్యార్థుల తల్లిదండ్రులకు కలెక్టరేట్ నుండి సందేశాలు పంపించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. 10వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థుల నుండి వారి పాఠ్యపుస్తకాలను తీసుకొని ప్రస్తుతం పదవ తరగతికి వచ్చిన విద్యార్థులకు అందజేసి వారు చదువుకునేలా చూడాలన్నారు. ప్రతి ఉపాధ్యాయుని దగ్గర వారి తరగతిలో చదువులో వెనుకబడిన విద్యార్థుల జాబితా ఉంటుందని, ఆ విద్యార్థులు వారి తల్లిదండ్రులను ఇప్పటి నుండే సంప్రదించి చదువుకునేలా ప్రేరేపించాలన్నారు. అలా చేస్తే ఆ విద్యార్థులు పరీక్షల్లో ఉత్తీర్ణులు చెందే అవకాశం ఉందన్నారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులలో చదువులో వెనుకబడిన విద్యార్థులకు కనీస అభ్యాసం చెప్పేందుకు గ్రామాల్లో కొందరు వాలంటీర్లు ముందుకు వచ్చారని, వారిని మండల ప్రత్యేక అధికారులు సంప్రదించి అభినందించాలని, అటువంటి మూడవ గ్రేడ్ లో ఉన్న ఆ విద్యార్థులను మొదటి గ్రేడులోకి తీసుకుని వచ్చే విధంగా కృషి చేయాలని వాలంటీర్లను కోరాలన్నారు ఈ టెలికాన్ఫరెన్స్ లో జిల్లా విద్యాశాఖాధికారి సుబ్బారావు, ఎంఈఓ లు, మండల ప్రత్యేక అధికారులు ఉన్నత పాఠశాల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు

# కూల్చేసిన ఇళ్లకు రిక్విజిషన్ లెటర్లు చూపించండి

### - పేర్ని వెంకట్రామయ్య(నాని), మాజీ మంత్రి



**మచిలీపట్నం ఏప్రిల్ 03 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** పోలీసు హక్కుల సంఘం నాయకుడిగా జైపాల్ మాకు నీతులు చెప్పి, ఆయన నీతి తప్పితే ఎలా? వైయస్సార్సీపీ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన పేర్ని కిట్టును ఉద్దేశించి సీఐ మాట్లాడిన మాటలను ఎలా సమర్థించుకుంటాడో చెప్పాలి. మీ గవర్నమెంట్లో ఇళ్లు కొట్టేశారని సీఐ మాట్లాడటం తప్పు కాదా? ఆయన ఇక్కడుండి చూశాడా? పోలీస్ అధికారిగా ఉంటూ రాజకీయ నాయకుడిగా మాట్లాడటం ఏమిటి? ఉద్దేశపూర్వకంగా కవ్వింపు చర్యలకు దిగిందిగాక దాన్ని సమర్థించుకుంటూ ప్రెస్మీట్ పెట్టడం సిగ్గుచేటు. మంత్రి కొల్లు రవీంద్ర ఎన్నోసార్లు పోలీస్ అధికారులను తిడితే ఈ జైపాల్ ఎందుకు ఖండించలేదు? తెలుగుదేశం పార్టీ నాయకుల దోపిడీలు, దురాగతాల నుంచి కాపాడటమే నా పని. ఇది మీకెందుకు గిట్టడం లేదో అర్థంకావడం లేదు. ఎన్ని అక్రమ కేసులు పెట్టినా, జైలుకే పంపినా వైయస్సార్సీపీ నాయకుడిగా ప్రజల పక్షాన పోరాడుతూనే ఉంటా. ఈ పోరాటం ఆపే ప్రసక్తే ఉండదు. దుర్మార్గాలకు వంతపాడుతున్న కొంతమంది పోలీసులను హెచ్చరిస్తుంటే జైపాల్ గారు ఎందుకు ఉలిక్కిపడుతున్నారో. కోరినట్టుగా పోస్టింగులు రావని అంటున్న జైపాల్ గారు, కూటమి ప్రభుత్వం వచ్చాక పామర్రులో జాయిన్ అయిన వెంటనే ట్రాన్స్ఫర్ అయిన సీఐ గురించి తెలియదా? కూటమి ప్రభుత్వంలో ఎమ్మెల్యేల లెటర్లు లేకుండా పోస్టింగ్లు ఇవ్వడం లేదన్నది బహిరంగ సత్యం. ఆయన కాదని చెప్పగలరా? టీడీపీ నాయకులకు తొత్తులుగా మారి తప్పులు చేస్తున్న పోలీసులనే హెచ్చరించాను తప్ప, నిజాయితీ గల అధికారులను గౌరవిస్తూనే ఉన్నా. పోలీసులు ప్రజలను ఇబ్బంది పెడుతున్నా చూస్తూ కూర్చోవాలా? పోలీసు బందోబస్తు కావాలని మున్సిపల్ శాఖ అభ్యర్థిస్తూ రాసిన రిక్విజిషన్ కాపీ మీద ఉన్న కమిషనర్ సంతకం చూస్తే నిజమా కాదా అనే అనుమానం కలుగుతోంది. కుమ్మరిగూడెంలో తెల్లవారుజామును కూల్చేసిన రెండు వందల ఇళ్లను, బందరులో 600 బడ్డీ కొట్లు పోలీస్ బందోబస్తుతో నేలమట్టం చేశారు. వాటికి సంబంధించిన రిక్విజిషన్ కాపీ ఉంటే చూపించాలి. హత్యాయత్నం అక్రమ కేసు పెట్టి అరెస్ట్ చేసిన నర్సింగ్ విద్యార్థిని సుప్రియకి సంబంధించిన సీసీ టీవీ ఫుటేజ్ ఇప్పటివరకు ఎందుకు రిలీజ్ చేయలేదు? పోలీసులు తప్పు చేయనప్పుడు స్టేషన్ ఫుటేజ్ ఇవ్వడానికి ఎందుకు భయం? అవినీతి పోలీసుల కారణంగా పోలీస్ వ్యవస్థ గౌరవం కోల్పోతుంది.

బరితెగిస్తున్న సీఐపై చర్యలు తీసుకోవాలి
– కైలే అనిల్ కుమార్, మాజీ ఎమ్మెల్యే

కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక రాష్ట్రంలో ఆటవిక రాజ్యం నడుస్తోంది. రాజకీయంగా తమతో విభేదించే వారి మీద దాడులు చేయడం, వారి ఆస్తులను ధ్వంసం చేయడం, ప్రతిఘటిస్తే ప్రాణాలు తీయడం సర్వసాధారణ విషయంగా మారిపోయింది. ప్రభుత్వ వైఫల్యాలను వ్యతిరేకించే వారిని, కూటమి నాయకుల తప్పులను ప్రశ్నించే వారిని ప్రశాంతంగా బతనీయడం లేదు. మచిలీపట్నంలో అక్రమంగా ఇంటిని కూల్చివేస్తుంటే మా నాయకుడు పేర్ని కృష్ణమూర్తి బాధితులకు అండగా నిలబడి అడ్డుకున్నారు. బాధితులను పరామర్శిస్తుంటే భారీ ఎత్తున పోలీసులను అక్కడికి పంపించి భయానక వాతావరణం సృష్టించారు. అన్యాయంగా ఇళ్లను కూల్చడం తప్పని ప్రశ్నించినందుకు సీఐ పరమేశ్వరరావు కలగజేసుకోవడమే కాకుండా మీ ప్రభుత్వంలో కూడా ఇలాగే జరిగింది అంటూ రాజకీయ నాయకుడిగా మాట్లాడటం హేయం. అంతేకాకుండా పీక్కోండి అంటూ అసభ్యంగా మాట్లాడటం సిగ్గుచేటు. ఇదే పరమేశ్వరరావు వైయస్సార్సీపీ ప్రభుత్వం ఉండగా కంకిపాడులో ఎస్సైగా పనిచేసేవాడు. గ్రామాల్లో పేకాట శిబిరాలను ప్రోత్సహిస్తున్నాడనే కారణంతో ఆయన్ను గత ప్రభుత్వంలో సస్పెండ్ కూడా చేయడం జరిగింది. కూటమి నాయకుల అడుగులకు మడుగులొత్తే కొంతమంది పోలీసుల మాటలు నమ్మి, వాస్తవాలను తెలుసుకోకుండా ఎస్పీ ప్రెస్నోట్ లు రిలీజ్ చేయడం శోచనీయం. పీక్కోండి అన్న సీఐ వ్యాఖ్యలకు సమాధానం చెప్పాలి. చట్టాలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న పోలీసులపై చర్యలు తీసుకోకపోగా కనీసం వారిని అదుపులో పెట్టడం లేదు. పోలీసులే టీడీపీ నాయకుల మాదిరిగా వ్యవహరిస్తున్న తీరుకు సిగ్గుపడాలి.

సీఐని తక్షణం సస్పెండ్ చేయాలి
– సింహాద్రి రమేష్, మాజీ ఎమ్మెల్యే

శాంతిభద్రతలను కాపాడాల్సిన పోలీసులే విఘాతం కలిగించేలా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం దుర్మార్గం. సీఐ మాట్లాడిన దిగజారుడు వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాల్సిందిపోయి ఎస్పీ సమర్థించేలా వ్యవహరిస్తున్నారు. పోలీసులతో ప్రెస్మీట్ పెట్టించి అబద్ధాలను నిజం చేసే ప్రయత్నం చేస్తున్నారు. కానీ సంఘటన స్థలంలో ఉన్నవారితోపాటు వీడియోలు చూసినవారంతా సీఐ దిగజారుడు ప్రవర్తనపై మండిపడుతున్నారు. ఎమ్మెల్యేగా పోటీ చేసిన నాయకుడి పట్ల సీఐ వ్యవహరించిన తీరు మరీ వివాదాస్పదంగా ఉంది. పీక్కోండి అంటూ రెచ్చగొట్టేలా మాట్లాడిన సీఐని తక్షణం సస్పెండ్ చేయాలి.

పోలీసులు అధికార పార్టీకి తొత్తులుగా మారారు
– ఉప్పాల రమేష్ (రాము), పెడన నియోజకవర్గ వైయస్సార్సీపీ సమన్వయకర్త

జనసేన నాయకుడి ఇంటిని ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా పోలీసులను అడ్డం పెట్టి మున్సిపల్ అధికారులు కూల్చివేస్తుంటే మా నాయకుడు పేర్ని కిట్టు ప్రతిఘటించారు. చట్టప్రకారం వ్యవహరించాలని డిమాండ్ చేస్తూ బాధిత కుటుంబానికి అండగా నిలబడ్డారు. ఆ సందర్భంగా సీఐ వ్యవహరించిన తీరు జుగుప్సాకరంగా ఉంది. పోలీసు వ్యవస్థ గౌరవానికే మచ్చ తెచ్చేలా ఉంది. ఇదంతా వీడియోల సాక్షిగా క్లియర్ కనిపిస్తోంది. అయినా ఇలాంటి వ్యక్తిని ఎస్పీ సస్పెండ్ చేయాల్సిందిపోయి వెనకేసుకురావడం దారుణం. పోలీసులే రాజకీయ నాయకులుగా, అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహరించడం సిగ్గుచేటు.

ఉద్దేశపూర్వకంగా రెచ్చగొట్టే కుట్ర
– చక్రవర్తి, పెనమలూరు నియోజకవర్గ వైయస్సార్సీపీ సమన్వయకర్త

పతిపక్ష పార్టీగా ప్రజా సమస్యలపై నిలదీస్తుంటే ఈ ప్రభుత్వం ఓర్చుకోలేకపోతోంది. నియమనిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న అధికారుల తీరుపై ప్రశ్నించినందుకు మా పార్టీ నాయకుడు పేర్ని కిట్టుపై అసభ్య పదజాలంతో సీఐ రెచ్చిపోయాడు. పోలీసులే ఉద్దేశపూర్వకంగా రెచ్చగొట్టేలా వ్యవహరించారు. ఆయన్ను తక్షణం సస్పెండ్ చేయాలి. చేసిన అక్రమాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి మా నాయకులపై అక్రమ కేసులు పెట్టినంత మాత్రాన భయపడే ప్రసక్తే లేదు.

## అక్రమంగా గోవులు తరలిస్తున్న వాహనం పట్టివేత



**పీఎం పాలెం ఏప్రిల్ 03 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** శ్రీకాకుళం నుంచి విశాఖ నగరంలోకి తొమ్మిది గోవులను అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని పీఎం పాలెం పోలీసులు అడ్డుకున్నారు. శుక్రవారం తెల్లవారుజామున కారు షెడ్డు కూడలి వద్ద తనిఖీలు చేపడుతుండగా ఈ వాహనం పట్టుబడింది. గోవులను ఎక్కడికి తరలిస్తున్నారన్న దానిపై డ్రైవర్ పొంతన లేని సమాధానం చెప్పడంతో.. పోలీసులు వాహనాన్ని, గోవులను స్వాధీనం చేసుకుని స్టేషన్కు తరలించారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.

## సీఎం సహాయనిధి చెక్కుల అందజేత



**నిడదవోలు ఏప్రిల్ 03 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** నిడదవోలు పట్టణ, మండలం, ఉండ్రాజవరం, పెరవలి ప్రాంతాల్లో ఇటీవల వివిధ అనారోగ్యాల కారణాలతో కొందరు సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నారు. హాస్పిటల్ బిల్లు నిమిత్తం ఈ దరఖాస్తులు చేసుకున్న 49 మంది లబ్ధిదారులకు రూ.27.58లక్షల విలువైన సీఎం సహజనిధి చెక్కులను శుక్రవారం అందజేశారు. ఉండ్రాజవరం మండలం వేలివెన్నులో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు చెక్కులను వారికి అందించారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించిన సందర్భంగా కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో పట్టణ తెదేపా అధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by K.S. Rangasayi and published from D.No: 1-3/21-16, Kamakotinagar, Vidyadharapuram, Vijayawada-520 012. (A.P.) and Printed at SKYLINE PRESS, D.No: 1-3/21-16, Kamakotinagar, Vidyadharapuram, Vijayawada-520 012. (A.P.), Associate Editor : K. Neeraja, Ph: 0866-2411299. E-mail: netimanadesam.vja@gmail.com